సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:263 | హైదరాబాద్ 25 ఏప్రిల్ 2026, శనివారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-263 | Hyderabad 25 April 2026, Saturday | Pages: 8, Rs. 5/-

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
### రూ. 4 లక్షల కోట్ల సంపద ఆవిరి



అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలం కావడంతో ఇన్వెస్టర్లలో పెరిగిన భయాందోళనలు శుక్రవారం దలాల్ స్ట్రీట్‌లో భారీ అమ్మకాల ఒత్తిడికి దారితీశాయి. దీని ప్రభావంతో సెన్సెక్స్ ఏకంగా 982 పాయింట్లు కుప్పకూలగా, నిఫ్టీ కీలకమైన 24,000 మార్కును కోల్పోయి 23,897 వద్ద స్థిరపడింది. కేవలం ఒక్కరోజే ఇన్వెస్టర్ల సంపద రూ. 4 లక్షల కోట్లు హరించుకుపోగా, ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన దిగ్గజ కంపెనీల షేర్లు 5 శాతం వరకు పతనమై మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 107 డాలర్లకు చేరడం, జేపీ మోర్గాన్ వంటి సంస్థలు భారత మార్కెట్ రేటింగ్‌ను తగ్గించడం భవిష్యత్ ఆర్థిక స్థితిగతులపై ఆందోళనలను మరింత పెంచుతున్నాయి.

...::: పూర్తి కథనం 7వ పేజీలో...

## H1-B వీసా మూడేళ్లు రద్దు




అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే భారతీయులకు భారీ షాక్ ఇస్తూ రిపబ్లికన్ ఎంపీ ఎలీ క్రీన్ 'ఎండ్ హెచ్1బీ వీసా అబ్యూస్ యాక్ట్ 2026'ను ప్రతిపాదించారు. ఈ బిల్లు ప్రకారం వీసా కోటాను భారీగా తగ్గించడంతో పాటు, కనీస వేతనాన్ని ఏకంగా రూ.1.67 కోట్లకు పెంచాలని, లాటరీ విధానం, ఓపీటీ సౌకర్యాన్ని రద్దు చేయాలని కోరారు. ఒకవేళ ఈ ప్రతిపాదనలు చట్టంగా మారితే, అమెరికాలోని లక్షలాది మంది భారతీయ ఐటీ నిపుణుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా, కొత్తగా వెళ్లాలనుకునేవారిని నిరాశకు గురి చేసింది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...





## మెటాలో భారీ లేఆఫ్స్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఆధిపత్యం కోసం సోషల్ మీడియా దిగ్గజం మెటా మరోసారి భారీగా ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. తన గ్లోబల్ వర్క్ ఫోర్స్ లో 10 శాతం మందిని, దాదాపు 8,000 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించి టెక్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏఐ ప్రాజెక్టుల కోసం నిధులను మళ్లించే క్రమంలో వ్యయ నియంత్రణే లక్ష్యంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. మే 20 నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ఉన్న ఖాళీలను కూడా రద్దు చేస్తూ మెటా చీఫ్ పీపుల్ ఆఫీసర్ అంతర్గత మెమో జారీ చేశారు. బాధితులకు కొంత మేర ఆర్థిక పరిహారం, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ, భవిష్యత్తులో మానవ వనరుల కంటే కృత్రిమ మేధకే సంస్థలు పెద్దపీట వేస్తాయనే చేదు నిజం ఈ లేఆఫ్స్ తో మరోసారి స్పష్టమైంది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## తెలంగాణలో ఐపీఎస్‌ల బదిలీ




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగంలో భారీ ప్రక్షాళన చేపట్టింది. పరిపాలనలో వేగం పెంచడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. మే 1 నుంచి ఈ బదిలీలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పుల్లో భాగంగా హోం శాఖకు నూతన సారథిని నియమించడంతో పాటు, ప్రతిష్టాత్మక 'ఫ్యూచర్ సిటీ'కి తొలి పోలీస్ కమిషనర్‌ను ఖరారు చేయడం విశేషం. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఉన్న శిఖాగోయల్ (1994 బ్యాచ్) కు ప్రభుత్వం అత్యంత కీలకమైన బాధ్యతలు అప్పగించింది. ఆమెను హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేస్తూ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే ఏడీజీ గా ఉన్న దేవేంద్ర సింగ్ చౌహాన్ ను డైరెక్టర్ జనరల్ గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనర్‌గా డా. తరుణ్ జోషి ఎంపికయ్యారు.

...::: తరువాయి 2వ పేజీలో...

# ఆమ్ ఆద్మీకి షాక్ !

ముగ్గురు రాజ్యసభ సభ్యుల గుడ్ బై

బీజేపీలో చేరనున్న రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్



**ఆప్ నేత, రాజ్యసభ సభ్యులు రాఘవ్ చద్దాతో పాటు మరో ఇద్దరు ఎంపీలు తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేశారు. త్వరలోనే బీజేపీలో చేరనున్నట్లు వారు తెలిపారు. పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రాజ్యసభలోని మూడింట రెండొంతుల మంది సభ్యులతో కలిసి బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు చద్దా ప్రకటించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తో ముగ్గురు ఎంపీలు భేటీ అయ్యారు.**

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

హస్తిన రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కీలక నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దాతో పాటు మరో ఇద్దరు ఎంపీలు సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. దీంతో ఆప్ అధిష్టానానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం వారు ముగ్గురూ తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేశారు. ఇటీవల చద్దాను పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ సంచలనాత్మక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ ముగ్గురు ఎంపీలు బీజేపీలో చేరనుండడంతో దేశ రాజధానిలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. మరో ఆరుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరనున్నట్లు చద్దా విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## ఆర్టీసీ చర్చలు సఫలం

రోడ్డెక్కనున్న బస్సులు!

సమ్మె విరమించిన ఆర్టీసీ జేఏసీ

ఆర్టీసీ విలీనానికి, సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

10 శాతం పీఆర్సీ ఇచ్చేందుకు అంగీకారం



తెలంగాణ ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ జరిపిన కీలక చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ, ఆర్టీసీ సమ్మెను విరమించాయి . చర్చలు సఫలం కావడంతో, శనివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచే ఆర్టీసీ బస్సులు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా రోడ్డెక్కనున్నాయి. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రుల బృందం ఆర్టీసీ జేఏసీ నేతలతో శుక్రవారం సుదీర్ఘంగా భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్లపై సానుకూల చర్చలు జరగడంతో సమ్మె విరమణకు జేఏసీ నేతలు మొగ్గు చూపారు. సుదీర్ఘ కాలం తర్వాత బస్సులు మళ్లీ రోడ్డెక్కుతుండటంతో సామాన్య ప్రయాణికులకు పెద్ద ఊరట లభించినట్లయింది.

...::: తరువాయి 2వ పేజీలో...

## ఉపేంద్ర ద్వివేదికి అరుదైన గౌరవం!



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

భారత సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేదికి అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలోని పెన్సిల్వేనియాలో గల ప్రతిష్టాత్మక యుఎస్ ఆర్మీ వార్ కాలేజీ తమ 'ఇంటర్‌నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో ఆయనకు చోటు కల్పించింది. ఈ మేరకు భారత సైన్యం శుక్రవారం అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ అరుదైన మైలురాయిని అధిగమించిన మూడవ భారతీయ సైన్యాధ్యక్షుడిగా జనరల్ ఉపేంద్ర ద్వివేది నిలిచారు. గతంలో మాజీ సైన్యాధ్యక్షులు జనరల్ వీకే సింగ్, జనరల్ విక్రమ్ సింగ్‌లు మాత్రమే ఈ గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ద్వివేది స్వయంగా ఈ కాలేజీలో పూర్వ విద్యార్థి కావడం విశేషం,

...::: తరువాయి 2వ పేజీలో...



## అణ్వాయుధాలు ప్రయోగించవద్దు

పరిస్థితి విషమించకముందే ఇరాన్ శాంతి ఒప్పందానికి రావాలని, ఆ దేశానికి సమయం మించిపోతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అణ్వాయుధాల అవసరం లేకుండానే ఇరాన్ సైన్యాన్ని, నాయకత్వాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశామని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్ – లెబనాన్ మధ్య కాల్పుల విరమణను మరో మూడు వారాలు పొడిగించారు. ఇరాన్ తన తీరు మార్చుకోకపోతే కఠిన పరిణామాలు తప్పవని స్పష్టం చేశారు. చైనా నౌక సీజ్ వ్యవహారంలో ఒక రహస్య 'బహుమతి' ఉందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి.

## హింస లేని ప్రజాస్వామ్యం..!



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల తొలి దశ పోలింగ్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా, శాంతియుతంగా ముగిసిందని భారత అత్యున్నత న్యాయస్థానం హర్షం వ్యక్తం చేసింది. భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పిందని కొనియాడింది. శుక్రవారం జరిగిన ఒక కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. బెంగాల్‌లో నమోదైన భారీ ఓటింగ్ శాతాన్ని చూసి భారత పౌరుడిగా తాను ఎంతో గర్వపడుతున్నానని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు విలువను గుర్తించినప్పుడు హింసకు ఆస్కారం ఉండదని, ఓటు హక్కు వినియోగమే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల సంఘాన్ని ఈ సందర్భంగా అభినందించారు.

## పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దు




పదేపదే హెచ్చరించినా బ్యాంకు నిర్వహణలో లోపాలు సరిదిద్దుకోకపోవడం, కేవైసీ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా కఠిన చర్యలు చేపట్టినట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. లైసెన్స్ రద్దుతో పాటు బ్యాంకును పూర్తిగా మూసివేసేందుకు హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రకటించడంతో 2017లో ప్రారంభమైన పేటీఎం బ్యాంకింగ్ ప్రస్థానం ముగింపు దశకు చేరుకుంది. ప్రస్తుతం ఉన్న ఖాతాదారులు తమ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించిన కేంద్ర బ్యాంకు, కొత్త డిపాజిట్లపై మాత్రం పూర్తి నిషేధం విధించింది. డిజిటల్ చెల్లింపుల రంగంలో అగ్రగామిగా ఉన్న సంస్థకు ఇది కోలుకోలేని దెబ్బగా మారింది.

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## వైసీపీ అరాచకాలను ఎండగట్టండి...



**మంగళగిరి (ఏడీఎన్ఎన్):**

రాష్ట్రంలో గత ఐదేళ్లుగా సాగిన అరాచకాలను, విపక్షంగా ఉన్నా మారలేదు అనిపిస్తున్న వైసీపీ వైఖరిని ప్రజలకు నిత్యం వివరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ల శిక్షణా తరగతులకు హాజరైన ఆయన, సమకాలీన రాజకీయ పరిణామాలు, పార్టీ బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో నేరగాళ్లతో పోరాడాల్సిన దుస్థితి వచ్చిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ' , 'కిల్లర్ పార్టీ'గా అభివర్ణించిన ఆయన, ఆ పార్టీ నాయకుల తీరుపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

...::: తరువాయి 2వ పేజీలో...


## కూటమి పాలనలో వ్యవసాయం కుదేలు



**తాడేపల్లి (ఏడీఎన్ఎన్):**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రైతు విభాగం కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. రైతుల పక్షాన నిలబడి పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర దక్కడం లేదని సజ్జల ఆవేదన వ్యక్తం చేశారు. "రైతులు పండించిన పంటను అమ్ముకోలేక అల్లాడుతుంటే, అధికార పార్టీ నేతలు దళారులతో కుమ్మక్కై వారిని నిలువునా దోచుకుంటున్నారు. ధరల స్థిరీకరణ నిధి ఊసే లేదు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులు పాలకులకు పట్టడం లేదు," అని ఆయన ధ్వజమెత్తారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన మంత్రులు సమస్యలను గాలికొదిలేసి విదేశీ పర్యటనల్లో ఉన్నారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో రైతులకు అండగా నిలిచిన ఆర్బీకే వ్యవస్థను నిర్వీర్యం చేశారని సజ్జల ఆరోపించారు. విత్తనాలు, ఎరువుల నుంచి మొదలుకొని మద్దతు ధర కల్పించే వరకు ప్రతి దశలోనూ రైతును మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతు సమస్యలపై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆందోళనలు చేపట్టాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## హైకోర్టులో ఆ ముగ్గురికి ఊరట...



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో నమోదైన పాత కేసుల విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్ , హరీశ్ రావులకు రాష్ట్ర హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. 2011లో ట్యాంక్ బండ్‌పై నిర్వహించిన చారిత్రాత్మక 'మిలియన్ మార్చ్' సందర్భంగా నమోదైన క్రిమినల్ కేసులను కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరుతూ వారు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.మిలియన్ మార్చ్ సందర్భంగా జరిగిన అల్లర్లు, ఉద్రిక్త పరిస్థితులకు సంబంధించి అప్పట్లో పోలీసులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను నిందితులుగా చేర్చారు. అయితే, ఆ సమయంలో వారు నేరుగా హింసాత్మక ఘటనల్లో పాల్గొనలేదని, కేవలం నిరసనలో భాగంగానే అక్కడ ఉన్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## నేడే కొత్త పార్టీ ఆవిష్కరణ...

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీని శనివారం ప్రారంభించనున్నారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ హాల్‌లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్ఎస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. తెలంగాణ ఆకాంక్షల కోసం పుట్టిన బీఆర్ఎస్, కాలక్రమంలో తన పేరును, పనితీరును, ఆత్మను మార్చుకుందని.. దాంతో ఆ పార్టీకి ప్రజలతో ఉన్న పేగు బంధం తెగిపోయిందని కవిత ఘాటుగా విమర్శించారు. ఏ పార్టీ అయినా తన మూల సిద్ధాంతం నుంచి పక్కకు తప్పుకుంటే మనుగడ సాగించలేదని ఆమె హెచ్చరించారు.కొత్త పార్టీ ఆవిష్కరణ సభ కోసం మునీరాబాద్‌లో భారీ ఏర్పాట్లు చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...






# పవన్ ఖేరాకు చుక్కెదురు..!

**కోల్‌కతా (ఏడీఎన్‌ఎన్):**

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కుటుంబ సభ్యులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరాకు న్యాయస్థానంలో చుక్కెదురైంది. తనను పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను గౌహతి హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. దీంతో ఈ కేసులో ఆయనకు చట్టపరమైన ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. గతంలో ఒక సందర్భంలో సీఎం హిమంత బిశ్వ శర్మ భార్యను ఉద్దేశించి పవన్ ఖేరా చేసిన కొన్ని వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై అస్సాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే పోలీసులు తనను అదుపులోకి తీసుకునే అవకాశం ఉందన్న ఆందోళనతో ఖేరా ముందస్తుగా హైకోర్టును ఆశ్రయించారు. ఖేరా పిటిషన్‌పై సుదీర్ఘంగా విచారణ జరిపిన గౌహతి హైకోర్టు, కేసులోని అభియోగాల తీవ్రతను పరిగణనలోకి తీసుకుంది. ఈ దశలో ముందస్తు బెయిల్ మంజూరు చేయడం సాధ్యపడదని స్పష్టం చేసింది. విచారణకు సహకరించాలని సూచిస్తూనే, న్యాయపరమైన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని కోర్టు అభిప్రాయపడింది. ఈ కేసులో పవన్ ఖేరా ఇప్పటికే పలుమార్లు పోలీసుల నుంచి నోటీసులు అందుకున్నారు. హైకోర్టులో ఊరట లభించకపోవడంతో ఇప్పుడు ఆయన ముందున్న ఏకైక మార్గం సుప్రీంకోర్టును ఆశ్రయించడమే. మరి ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ నేత అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారా? లేదా? అన్నది వేచి చూడాలి.



# దీదీకి బెంగాల్ గుడ్ బై!

**కోల్‌కతా (ఏడీఎన్‌ఎన్):**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో నమోదైన రికార్డు స్థాయి పోలింగ్ రాష్ట్రంలో రాబోయే రాజకీయ మార్పునకు సంకేతమని, దీదీ గద్దె దిగిపోవడం ఖాయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. కోల్‌కతాలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి దశలో పోలింగ్ జరిగిన స్థానాల్లో మెజారిటీ సీట్లను (110కి పైగా) భాజపా కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని అభివృద్ధి వైపే బెంగాల్ ప్రజలు మొగ్గు చూపారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చొరబాట్లు, అవినీతి, భయానక పాలనకు ముగింపు పలికి, చట్టబద్ధమైన పాలనను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి అభ్యర్థిపై వస్తున్న వదంతులకు అమిత్ షా తెరదించారు. బెంగాల్‌లో పుట్టి, బెంగాలీ భాష మాట్లాడే వ్యక్తి మాత్రమే ముఖ్యమంత్రి అవుతారని, అది ఖచ్చితంగా ఒక బీజేపీ కార్యకర్తేనని ఆయన స్పష్టం చేశారు. మహిళల భద్రతకు, యువత ఉపాధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని అమిత్ షా వెల్లడించారు.

# వైసీపీ అరాచకాలను ఎండగట్టండి...

**మొదటిపేజీ తరువాయి...**

"రాజకీయాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా విమర్శలు ఉండాలి కానీ, హత్యలు , భౌతిక దాడులతో ప్రత్యర్థులను అణచివేయాలనుకోవడం రాక్షసత్వం. ఇలాంటి అరాచక శక్తుల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యపరచాలి," అని క్లస్టర్ ఇన్‌ఛార్జ్ లకు సూచించారు. ఇటీవల జరిగిన పెద్దదస్తగిరి హత్యోదంతం , మాజీ ఎమ్మెల్సీ అనంతబాబు దుశ్చర్యలు వంటి అంశాలను చంద్రబాబు ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. "హత్యలు చేయడం, నేరాలను సమర్థించుకోవడం ఆ పార్టీ నాయకులకు అలవాటుగా మారింది. ఇలాంటి సంఘటనలను చూస్తుంటే ఆ పార్టీకి నేర చరిత్ర తప్ప ప్రజా సేవ పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతోంది," అని ధ్వజమెత్తారు. నేరస్థులను వెనకేసుకొచ్చే సంస్కృతి సమాజానికి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. క్లస్టర్ స్థాయిలో ప్రతి కార్యకర్త సమర్థవంతంగా పనిచేయాలని చంద్రబాబు కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వివరిస్తూనే, మరోవైపు వైసీపీ చేస్తున్న కుతంత్రాలను, అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నేరగాళ్లకు రాజకీయాల్లో చోటు లేని విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని, రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# ఉపేంద్ర ద్వివేదికి అరుదైన గౌరవం!

**మొదటిపేజీ తరువాయి...**

ఆయన వృత్తిపరమైన నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. తన పర్యటనలో భాగంగా జనరల్ ద్వివేది ఆ విద్యాసంస్థలోని కీలక విభాగాలను సందర్శించి, పలు ప్యానెల్ చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారు. అక్కడ కొనసాగుతున్న స్కాలర్స్ ప్రోగ్రామ్‌లోని అధునాతన స్టడీ ప్రాజెక్టులను ఆయన స్వయంగా సమీక్షించారు. భవిష్యత్తు సైనిక వ్యూహాలు, విద్యాపరమైన అంశాలపై అక్కడి నిపుణులతో తన ఆలోచనలను పంచుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం భారత్, అమెరికా దేశాల మధ్య ఉన్న సైనిక సంబంధాలను మరింత బలపరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక ఉన్నత స్థాయి భారతీయ అధికారికి అమెరికా సైనిక విద్యాసంస్థలో లభించిన ఈ గుర్తింపు, భారత సైన్యం ప్రాముఖ్యతను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెబుతోంది.



# హుగ్లీ తీరాన మోదీ సందడి

**కోల్‌కతా (ఏడీఎన్‌ఎన్):**

ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఉదయం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో పడవలో విహరిస్తూ సందడి చేశారు. విద్యాసాగర్ సేతు సాక్షిగా నదీ అందాలను తన కెమెరాలో బంధించిన మోదీ, స్థానికులు, పడవ కార్మికులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. 'గంగమ్మ బెంగాలీల ఆత్మలో ప్రవహిస్తుంటుంది'అని ఆయన అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ ను పంచుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కృష్ణానగర్ సభలో పాల్గొన్న ప్రధాని, బేలూర్ మఠాన్ని కూడా సందర్శించి ఆధ్యాత్మికతను చాటుకున్నారు. మొదటి విడతలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 91.91 శాతం పోలింగ్ నమోదు కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ భారీ పోలింగ్ రాష్ట్రంలో మార్పును సూచిస్తోందని, 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ 'మహా జంగిల్ రాజ్' మే 4వ తేదీతో అంతం కాబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాత్రం పోలింగ్ సరళి తమకే అనుకూలంగా ఉందని కౌంటర్ ఇచ్చారు. మొత్తం 152 స్థానాలకు గాను తమ పార్టీ 125 నుంచి 134 సీట్లు కైవసం చేసుకుని మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమాగా ఉన్నారు. మే 4న వెలువడనున్న ఫలితాల్లో బెంగాల్ పీఠం ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

# ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు...

**కోల్ కతా (ఏడీఎన్‌ఎన్):**

పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా తమ పేర్లను అన్యాయంగా తొలగించారంటూ 65 మంది ఎన్నికల అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తాము ఎన్నికల విధుల్లో ఉన్నామని, అధికారిక డ్యూటీ ఆర్డర్లు, నంబర్లు ఉన్నప్పటికీ తమ పేర్లను ఏకపక్షంగా తొలగించారని బాధితులు కోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ వ్యవహారంలో నేరుగా జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. బాధితులు సంబంధిత అప్పీలేట్ ట్రిబ్యునళ్లను ఆశ్రయించాలని సూచించింది. కేసు విచారణ సందర్భంగా



జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విడత ఎన్నికల్లో పిటిషనర్లు ఓటు వేయలేకపోవచ్చు కానీ, ఓటర్ల జాబితాలో పేరు ఉండేలా చూసుకోవడం అనేది 'మరింత విలువైన హక్కు' అని జస్టిస్ బాగ్చీ అభివర్ణించారు. ఆ ప్రాథమిక హక్కును తాము కాపాడతామని భరోసా ఇస్తూనే, ఇలాంటి వివాదాల పరిష్కారం కోసం ఇప్పటికే 19 ప్రత్యేక జ్యుడీషియల్ ట్రిబ్యునళ్లు పనిచేస్తున్నాయని కోర్టు గుర్తుచేసింది. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కార్యక్రమంలో భాగంగా పెద్దఎత్తున పేర్లను తొలగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల విధుల్లోనే ఉన్న అధికారుల పేర్లు కూడా గల్లంతు కావడంతో వ్యవస్థలో లోపాలు ఉన్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బాధితులంతా తమ వాదనలను వినిపించేందుకు అప్పీలేట్ ట్రిబ్యునళ్ల మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

# ఆమ్ ఆద్మీకి షాక్..!

**మొదటిపేజీ తరువాయి...**

ఈ సందర్భంగా ఆయన ఆప్ అధిష్టానంపై నిప్పులు చెరిగారు. గత 15 ఏళ్లుగా ఆప్ ఎదుగుదల కోసం ఎంతో కృషి చేశానని, అయితే పార్టీ ఇప్పుడు ఆశయాలకు దూరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నేతలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. తాము వారి నేరాల్లో భాగస్వాములు కాలేకనే పార్టీకి దూరమయ్యామన్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాజ్యసభలోని మూడింట రెండొంతుల మంది సభ్యులం (10 మందిలో ఏడుగురు) భాజపాలో విలీనం కావాలని నిర్ణయించుకున్నామని వివరించారు.

**అవినీతిపరుల చేతుల్లోకి.. ఆమ్ ఆద్మీ!**


ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తిగా అవినీతిపరుల చేతుల్లోకి వెళ్లిపోయిందని, పార్టీ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చారని ఎంపీ చద్దా విమర్శించారు. పార్టీలో నిజాయితీ కలిగిన నాయకులకు గౌరవం లేదని, అందుకే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇంకా స్వాతి మాలీవాల్, హర్భజన్ సింగ్, సందీప్ పాఠక్, అశోక్ మిత్తల్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ వంటి ప్రముఖ నేతలు కూడా కమలం తీర్థం పుచ్చుకోనున్నారన్నారు. ఇప్పటికే సంతకాలతో కూడిన లేఖలను రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించినట్లు చద్దా వెల్లడించారు. సానుకూల రాజకీయాల కోసమే తాము బీజేపీలో చేరబోతున్నామన్నారు. ఇదిలా ఉండగా.. చద్దాను పదవి నుంచి తొలగించడమే ఈ వలసలకు ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో అత్యంత కీలకమైన యువ నేతగా ఎదిగిన రాఘవ్ చద్దా బీజేపీలోకి వెళ్లనుండడం అరవింద్ కేజ్రీవాల్‌కు రాజకీయంగా పెద్ద సవాలుగా మారింది. రాజ్యసభలో ఆప్ బలం గణనీయంగా తగ్గడమే కాకుండా, పార్టీ అంతర్గత కుమ్ములాటలు ఇప్పుడు బహిర్గతమయ్యాయి.

**రాఘవ్ చద్దాను బీజేపీ పావుగా వాడుకుంది: ఆప్**

ఈ పరిణామాలపై ఆమ్‌ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. రాఘవ్ చద్దాను ఒక పావుగా వాడుకుని భాజపా తమ పార్టీలో చీలిక తెచ్చేందుకు కుట్ర పన్నిందని ఆరోపించింది. ఏడుగురు ఎంపీలను తీసుకువస్తే కేంద్ర మంత్రి పదవి ఇస్తామని అమిత్ షా ఆశ చూపారని ఆప్ విమర్శించింది, అయితే ఆ ఆరోపణలన్నీ నిరాధారమైనవని బీజేపీ అధిష్టానం కొట్టిపారేసింది. ఈ ఆకస్మిక పరిణామం ఢిల్లీ రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసేలా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**పంజాబ్ ఆత్మగౌరవానికి జరిగిన అవమానం: - ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్**

ఈ పరిణామంపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. ఇది



పంజాబ్ ప్రజల తీర్పును కాలరాయడమేనని మండిపడ్డారు. పంజాబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాఘవ్ చద్దా, హర్భజన్ సింగ్ వంటి కీలక నేతలు పార్టీ మారడంపై కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. బీజేపీ మరోసారి పంజాబీలను వంచించిందన్నారు. ప్రజాస్వామ్యంపై గౌరవం లేకుండా కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి ఎంపీలను లాక్కుందని ఆయన ఆరోపించారు. పంజాబ్ హక్కుల కోసం పోరాడాల్సిన వారిని తమవైపు తిప్పుకుని ఆ రాష్ట్రాన్ని బలహీనపరచాలని బీజేపీ కుట్ర పన్నుతోందని విమర్శించారు. నాయకులు పార్టీని వీడినంత మాత్రాన ఆప్ సిద్ధాంతం, ప్రజల మద్దతు చెక్కుచెదరవని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. మెజారిటీ ఎంపీలు విలీనం కావడంతో సాంకేతికంగా అనర్హత వేటు నుంచి తప్పించుకున్నప్పటికీ, ఫిరాయింపుదారులకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ కూడా ఈ చర్యను ఖండించారు. పంజాబ్ గడ్డపై బీజేపీకి స్థానం లేదని స్పష్టం చేయడంతో ఆప్-బీజేపీ మధ్య రాజకీయ యుద్ధం మరింత ముదిరింది.

**ఆప్ నాయకత్వ వైఫల్యమే:- అన్నా హజారే సంచలన వ్యాఖ్యలు**

రాఘవ్ చద్దా సహా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీలు పార్టీని వీడి బీజేపీలో చేరనుండడంపై ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ సరైన మార్గంలో నడిచి ఉంటే ఎంపీలు బయటకు వెళ్లేవారు కాదని, ఇది ముమ్మాటికీ ఆప్ నాయకత్వ వైఫల్యమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఎక్కడ ఉండాలి, ఎక్కడి నుండి వెళ్ళిపోవాలి అనేది వ్యక్తిగత నిర్ణయమన్నారు. వారు పార్టీని వీడటానికి బలమైన కారణాలు ఉండే ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఆప్ తన పంథాను మార్చుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆయన అన్నారు. ఒకప్పుడు తన వెంటే ఉన్న కేజ్రీవాల్ స్థాపించిన పార్టీలోని అంతర్గత సంక్షోభంపై హజారే చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ఆర్టీసీ చర్చలు సఫలం

**మొదటిపేజీ తరువాయి...**

తెలంగాణ ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన సుదీర్ఘ చర్చలు ఎట్టకేలకు ఫలప్రదమయ్యాయి. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సుమారు 7 గంటల పాటు జరిగిన ఈ భేటీలో ప్రతిష్టంభన తొలగి, సమ్మె విరమణకు మార్గం సుగమమైంది. 2026 ఏప్రిల్ 24న జరిగిన ఈ కీలక చర్చలు కొలిక్కి రావడంతో, శనివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచే ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కనున్నాయి.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి , అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. జేఏసీ నేతలు ప్రభుత్వం ముందుంచిన మొత్తం 32 డిమాండ్లపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించింది. వాస్తవానికి చర్చల ప్రారంభం నుంచే 29 డిమాండ్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, మిగిలిన మూడు కీలక అంశాలపైనే సందిగ్ధత కొనసాగుతూ వచ్చింది. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం , పీఆర్సీ బకాయిల చెల్లింపు వంటి ఆర్థిక పరమైన అంశాలపైనే చర్చలు సుదీర్ఘంగా సాగాయి. పీఆర్సీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జేఏసీ నేతలు పట్టుబట్టగా, ఇవి ఆర్థిక భారంతో కూడుకున్నవి కావడంతో ప్రభుత్వం కొంత సమయం కోరింది. చివరకు ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించేందుకు మంత్రుల బృందం ప్రతిపాదించగా, జేఏసీ నేతలు అందుకు అంగీకరించారు. ఆర్టీసీ విలీనం అనే సున్నితమైన అంశంపై ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని వేసేందుకు మొగ్గు చూపింది. విలీన ప్రక్రియకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికీ, విలీనం జరిగిన తర్వాత గుర్తింపు సంఘాల ఎన్నికలు ఉండవని, అలాగే పీఆర్సీ వంటి అంశాలలో మార్పులు ఉంటాయని మంత్రులు వివరించారు. ఈ అంశంపై దాదాపు మూడు విడతలుగా చర్చలు జరిపిన తర్వాత ఒక స్పష్టమైన అవగాహన ఏర్పడింది.కార్మికుల సంక్షేమానికి సంబంధించి ఇతర ప్రయోజనాలను కూడా దశలవారీగా అందించేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సుల రాకను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుతానికి అక్కడి ఉద్యోగుల బదిలీలు చేపట్టబోమని మంత్రులు హామీ ఇచ్చారు. ఇది నగర పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగులకు పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది.మరో కీలక నిర్ణయంగా, ఆర్టీసీలో కారుణ్య నియామకాలను పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బాధితుల కుటుంబాలకు న్యాయం చేకూరనుంది. ఉద్యోగ భద్రత , ఇతర సౌకర్యాల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీలపై జేఏసీ నాయకులు సంతృప్తి వ్యక్తం చేస్తూ సమ్మెను విరమించేందుకు సిద్ధమయ్యారు.
చర్చల ముగింపులో మంత్రుల బృందం ఆర్టీసీ కార్మికుల శ్రమను అభినందిస్తూ, సంస్థను లాభాల బాటలో నడిపేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చింది. జేఏసీ నేతలు కూడా ప్రభుత్వ సానుకూల ధోరణిని స్వాగతిస్తూ, కార్మికులంతా తక్షణమే విధుల్లో చేరాలని పిలుపునిచ్చారు. ఈ పరిణామంతో గత కొద్ది రోజులుగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు తెరపడనుంది.శనివారం ఉదయం నుంచే బస్సులు డిపోల నుంచి బయటకు రానుండటంతో రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ మళ్లీ సాధారణ స్థితికి చేరుకోనుంది. విద్యా సంస్థలు, కార్యాలయాలకు వెళ్లే వారికి ఈ వార్త పెద్ద ఊరటనిచ్చింది. ప్రభుత్వం మరియు జేఏసీ మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఆర్టీసీ చరిత్రలో ఒక కీలక మలుపుగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.చివరి నిమిషం వరకు ఉత్కంఠగా సాగిన ఈ చర్చల పర్వం సుఖాంతం కావడంతో అటు కార్మికులు, ఇటు ప్రభుత్వం ఊపిరి పీల్చుకున్నాయి. ఒప్పందంలో పేర్కొన్న హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా, ప్రజా రవాణాలో అంతరాయం కలగకుండా చూస్తామని జేఏసీ నేతలు వెల్లడించారు. మొత్తం మీద ఏప్రిల్ 25 నుంచి తెలంగాణ రోడ్లపై మళ్లీ ఆర్టీసీ సందడి మొదలుకానుంది.

# విశ్వాస పరీక్షలో సమ్రాట్ చౌదరి సర్కార్ విజయం!

**బీహార్ (ఏడీఎన్‌ఎన్):**

బీహార్ రాజకీయాల్లో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి నేతృత్వంలోని బిజెపిజెడియు ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో నిర్వహించిన విశ్వాస పరీక్షలో ఘనవిజయం సాధించింది.



ఏప్రిల్ 15న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమ్రాట్ చౌదరి, ఏప్రిల్ 24న జరిగిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో తన మెజారిటీని నిరూపించుకుని అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఈ బలపరీక్షలో ప్రభుత్వం వాయిస్ ఓట్ (మౌఖిక ఓటు) ద్వారా విజయం సాధించినట్లు స్పీకర్ ప్రేమ్ కుమార్ అధికారికంగా ప్రకటించారు. 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో అధికార ఎన్డీయే కూటమికి 201 మంది ఎమ్మెల్యేల భారీ మద్దతు లభించగా, విపక్షాలు కేవలం 35 నుండి 41 ఓట్లకే పరిమితమయ్యాయి. నితీష్‌కుమార్ రాజీనామా అనంతరం ఏర్పడిన ఈ కొత్త ప్రభుత్వం, ఎటువంటి ఆటంకాలు లేకుండా సునాయాసంగా నెగ్గి రాష్ట్రంలో తన రాజకీయ పట్టును చాటుకుంది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్, సీఎం సామ్రాట్ చౌదరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది.




# పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దు

**ముంబయ్ (ఏడీఎన్‌ఎన్):**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రముఖ ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎంకు కోలుకోలేని షాక్ ఇచ్చింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ బ్యాంకింగ్ లైసెన్స్ ను రద్దు చేస్తున్నట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. పదేపదే నిబంధనలను ఉల్లంఘించడం, హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతో డిపాజిటర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. పేటీఎం బ్యాంక్ కార్యకలాపాలు ప్రజా ప్రయోజనాలకు, ముఖ్యంగా డిపాజిటర్ల ఆశయాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆర్‌బీఐ గుర్తించింది. బ్యాంకు నిర్వహణలో లోపాలు ఉన్నాయని, ఇదే తీరు కొనసాగితే ఖాతాదారులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే బ్యాంకింగ్ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించింది.

**కోర్టు మెట్లు ఎక్కనున్న ఆర్‌బీఐ**

కేవలం లైసెన్స్ రద్దుతోనే ఆగకుండా, పేటీఎం పేమెంట్స్ బ్యాంకును పూర్తిగా మూసివేసే ప్రక్రియను ఆర్‌బీఐ వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ సంబంధిత హైకోర్టులో దరఖాస్తు చేయనున్నట్లు కేంద్ర బ్యాంక్ వెల్లడించింది. దీంతో పేటీఎం బ్యాంక్ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి ఈ చర్యలు అకస్మాత్తుగా జరిగినవి కావు. 2022 నుంచే పేటీఎంపై ఆర్‌బీఐ నిఘా పెంచింది. కొత్త కస్టమర్లను చేర్చుకోవద్దని గతంలోనే ఆదేశించడమే కాకుండా, మార్చి 2024 నుంచి వాలెట్లు, ఫాస్టాగ్, ఎన్‌సీఎమ్‌సీ కార్డుల్లో టాప్‌అప్‌లను పూర్తిగా నిలిపివేసింది. కేవైసీ నిబంధనల ఉల్లంఘనలు ప్రధాన కారణంగా నిలిచాయి.

**డిపాజిటర్లకు భరోసా...**

బ్యాంక్ లైసెన్స్ రద్దు అయినప్పటికీ, ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ భరోసా ఇచ్చింది. డిపాజిటర్ల సొమ్మును తిరిగి చెల్లించడానికి సరిపడా నగదు నిల్వలు బ్యాంకు వద్ద ఉన్నాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం పాత డిపాజిట్ల విత్‌డ్రాయల్స్ కు మాత్రమే అవకాశం ఉంది. కొత్త డిపాజిట్లను స్వీకరించడంపై నిషేధం కొనసాగుతుంది.

**ముగిసిన ఏడేళ్ల ప్రస్థానం**

విజయ్ శేఖర్ శర్మ నేతృత్వంలో 2017లో ఎంతో ఆర్భాటంగా ప్రారంభమైన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్, రెగ్యులేటరీ నిబంధనలను పాటించడంలో విఫలమవడంతో చివరికి మూసివేత దశకు చేరుకుంది. డిజిటల్ బ్యాంకింగ్ రంగంలో ఒక వెలుగు వెలిగిన ఈ సంస్థ, నిబంధనల ఉల్లంఘన కారణంగా ఇప్పుడు తన ఉనికిని కోల్పోనుంది.

# తెలంగాణలో ఐపీఎస్‌ల బదిలీ

**మొదటిపేజీ తరువాయి...**

ప్రస్తుత సీపీ సుధీర్ బాబు పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో, ఏసీబీ డైరెక్టర్‌గా ఉన్న తరుణ్ జోషికి ఈ కీలక బాధ్యతలను కట్టబెట్టింది. మరోవైపు మల్కాజిగిరి సీపీగా ఉన్న అవినాష్ మొహంతీ ని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా , ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చింది. సిబ్ ఐజీగా బాధ్యతలు నిర్వహిస్తున్న బి. సుమతి ని మల్కాజిగిరి నూతన పోలీస్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. అదే విధంగా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా ఉన్న షా నవాజ్ ఖాసిం ను మల్టీ జోన్ II ఐజీపీగా బదిలీ చేసింది. ఐజీపీ (ఇంటెలిజెన్స్) గా ఉన్న కార్తికేయకు సిబ్ ఐజీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ భారీ బదిలీలతో రాష్ట్ర పోలీస్ శాఖలో నూతన జోష్ నెలకొంది.

# హైకోర్టులో ఆ ముగ్గురికి ఊరట


**మొదటిపేజీ తరువాయి...**

దర్యాప్తులో కూడా వారి ప్రమేయంపై సరైన ఆధారాలు లేవని, ఇవి రాజకీయ ప్రేరేపిత కేసులుగా న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు, 15 ఏళ్ల కిందట నమోదైన ఈ కేసులను ఇకపై కొనసాగించడంలో అర్థం లేదని అభిప్రాయపడింది. మిలియన్ మార్చ్ అనేది ఒక ప్రజా ఉద్యమమని, ఆ సమయంలో నమోదైన కేసులను కొట్టివేస్తూ ధర్మాసనం తీర్పునిచ్చింది. ఇప్పటికే కాళేశ్వరం విచారణ కమిషన్ విషయంలో ఊరట పొందిన బీఆర్ఎస్ అగ్రనేతలకు, ఇప్పుడు ఈ పాత కేసుల నుంచి విముక్తి లభించడం రాజకీయంగా కూడా ఆ పార్టీకి మేలు చేకూర్చే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులు కొట్టివేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం పోరాడిన నేతలపై అక్రమంగా కేసులు పెట్టారని, చివరకు న్యాయమే గెలిచిందని ఆ పార్టీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. వరుసగా లభిస్తున్న కోర్టు తీర్పులతో బీఆర్ఎస్ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

# నేడే కొత్త పార్టీ ఆవిష్కరణ

**మొదటిపేజీ తరువాయి...**

సభ ప్రాంగణం తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా వరంగల్ కాకతీయ తోరణం ఆకృతిలో ప్రధాన ప్రవేశ ద్వారం, తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు డా. బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వంటి మహనీయుల విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు . సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో జరిగే ఈ సభకు 40 నుంచి 50 వేల మంది తరలివస్తారని అంచనా వేస్తున్నారు. వచ్చిన వారందరి కోసం 60 వేల మందికి భోజన వసతి, 50 ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. శనివారం ఉదయం 8 గంటలకు సభ ప్రారంభం కానుండగా, సరిగ్గా 10 గంటలకు పార్టీ పేరు , జెండాను కవిత ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆమె అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి సభా ప్రాంగణానికి చేరుకుంటారు. సభకు వచ్చే వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లు , సహాయక సిబ్బందిని ఏర్పాటు చేయడం విశేషం. సభలో జరిగే కార్యక్రమాలను అందరూ స్పష్టంగా వీక్షించేందుకు 35 భారీ ఎల్ఈడీ స్క్రీన్లను కూడా సిద్ధం చేశారు.మధ్యాహ్నం 12 గంటల తర్వాత కొత్త పార్టీ జెండాలతో సుమారు 2000 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ బంజారాహిల్స్ మీదుగా ఓల్డ్ సిటీ , వివిధ నియోజకవర్గాల గుండా సాగుతూ, పార్టీ జెండా ఆవిష్కరణలు నిర్వహిస్తూ చివరకు పార్టీ కార్యాలయానికి చేరుకోనుంది. తెలంగాణలో ఇంకా మిగిలి ఉన్న ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని కవిత స్పష్టం చేశారు. ఈ నూతన పార్టీ ఆవిర్భావం తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని ఏ విధంగా మారుస్తుందో అన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది.



## మదురో అరెస్టుపై
## రూ.3 కోట్ల బెట్టింగ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా సైన్యంలో పనిచేస్తూ, అత్యంత రహస్యంగా సాగాల్సిన సైనిక ఆపరేషన్ వివరాలను తన స్వలాభం కోసం వాడుకున్న ఒక సైనికుడి ఉదంతం సంచలనం సృష్టిస్తోంది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని ముందే పసిగట్టిన సదరు సైనికుడు, ప్రిడిక్షన్ మార్కెట్‌లో పందెం కాసి ఏకంగా రూ.3 కోట్లకు పైగా గెలుచుకున్నాడు. ఈ 'ఇన్సైడర్ ట్రేడింగ్' వ్యవహారం బయటపడటంతో అమెరికా అధికారులు అతడిని కటకటాల్లోకి నెట్టారు. ఒక సైనికుడే దేశ రహస్యాలను బెట్టింగ్ కోసం వాడటం సంచలనంగా మారింది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధించడానికి అమెరికా సైన్యం ఈ ఏడాది జనవరిలో 'ఆపరేషన్ అబ్జల్యూట్ రిజాల్వ్' పేరుతో ఒక మెరుపు దాడిని నిర్వహించింది. ఈ ఆపరేషన్ కోసం డిసెంబరు నుంచే అత్యంత రహస్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మిషన్‌లో పాల్గొన్న అమెరికా సైనికుడు గ్యానన్ కెన్ వాన్ డైక్‌కు మదురో ఎప్పుడు, ఎలా అదుపులోకి వస్తారనే కీలక సమాచారం ముందే తెలిసింది. దేశభక్తిని పక్కనపెట్టి, ఆ రహస్య సమాచారాన్ని సొమ్ము చేసుకోవాలని భావించిన డైక్.. 'పాలీమార్కెట్' అనే వెబ్‌సైట్‌లో మదురో నిర్బంధంపై భారీ స్థాయిలో బెట్టింగ్ కాశాడు. అనుకున్నట్టుగానే ఆపరేషన్ విజయవంతం కావడంతో, అతడు సుమారు 4 లక్షల డాలర్లు (భారత కరెన్సీలో రూ.3 కోట్లకు పైగా) గెలుచుకున్నాడు. ఆ తర్వాత ఆ సొమ్మును ఎవరికీ అనుమానం రాకుండా క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి మళ్లించాడు. ఈ అసాధారణ లావాదేవీలపై నిఘా ఉంచిన అధికారులు లోతుగా విచారణ జరపడంతో డైక్ అసలు రంగు బయటపడింది. అధికారిక రహస్యాలను బెట్టింగ్ కోసం వినియోగించడం, ఆర్థిక అక్రమాలకు పాల్పడటం వంటి తీవ్రమైన నేరాల కింద అతడిపై కేసులు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేశారు.

## ఖమేనీ కాలుకి శస్త్రచికిత్స

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



ఇరాన్ ప్రస్తుత సుప్రీం మొజ్తాబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపై వస్తున్న వార్తలు పశ్చిమ ఆసియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా- ఇజ్రాయెల్ దాడుల సమయంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారనే సమాచారం తాజాగా వాస్తవరూపం దాల్చుతున్నాయి. 'ది న్యూయార్క్ టైమ్స్' , 'రాయిటర్స్' వంటి అంతర్జాతీయ మీడియా సంస్థల కథనాల ప్రకారం, ఖమేనీ ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోయాయని, ఆయన మాట్లాడలేని స్థితిలో ఉన్నారని తెలుస్తోంది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనకు త్వరలోనే భారీ స్థాయిలో ప్లాస్టిక్ సర్జరీ చేసేందుకు వైద్య బృందం సిద్ధమవుతోంది. ఈ దాడుల ప్రభావంతో ఖమేనీ ఒక కాలును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే ఆయన కాలికి మూడుసార్లు శస్త్రచికిత్సలు జరిగినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని, దీంతో ఆయనకు కృత్రిమ కాలు అమర్చే ప్రక్రియ ప్రారంభమైందని సమాచారం. ఆయన చేతికి కూడా సర్జరీ జరిగిందని, అది క్రమంగా మెరుగుపడుతోందని తెలుస్తోంది. తాను శారీరకంగా బలహీనపడ్డాననే విషయం ప్రపంచానికి, ముఖ్యంగా ఇజ్రాయెల్ నిఘా వర్గాలకు తెలియకుండా ఉండేందుకు ఆయన ఈ నెల 24 నాటికి కూడా బహిరంగంగా కనిపించలేదు. ఆయన ఎక్కడ ఉన్నారనేది అత్యంత రహస్యంగా ఉంచబడింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ (వృత్తిరీత్యా గుండె శస్త్రచికిత్స నిపుణుడు) స్వయంగా ఖమేనీ చికిత్సను పర్యవేక్షిస్తుండటం గమనార్హం. ఇజ్రాయెల్ దాడుల భయంతో ఇరాన్ రక్షణ విభాగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. సుప్రీం నేతను కలిసేందుకు ఏ అధికారికీ అనుమతి లేదని, కేవలం చేతితో రాసిన ఉత్తరాల ద్వారానే కమ్యూనికేషన్ జరుగుతోందని తెలుస్తోంది. ఈ ఉత్తరాలను మోటార్ సైకిల్ కొరియర్ల ద్వారా రహస్యంగా చేరవేస్తున్నారు. పాలనలో జాప్యం కలగకుండా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్స్ జనరల్స్ తో కూడిన ఒక ప్రత్యేక బోర్డును ఖమేనీ ఏర్పాటు చేశారు. ఈ బోర్డే ప్రస్తుతం యుద్ధ వ్యూహాలు, జాతీయ భద్రతపై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. హర్మూజ్ జలసంధి దిగ్బంధనం వంటి అంశాలపై ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో, ఖమేనీ ఆరోగ్యంపై వస్తున్న ఈ వార్తలతో ఇరాన్ రాజకీయ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది.

## మలక్కా లో విదేశీ
## నౌకలపై టోల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



మధ్యప్రాచ్యంలో ప్రపంచ వాణిజ్యానికి మరో భారీ ముప్పు పొంచి ఉందనే సంకేతాలు అందుతున్నాయి. ఆసియాలోని అత్యంత కీలకమైన 'మలక్కా జలసంధి' కేంద్రంగా కొత్త వివాదం ముసురుకుంటోంది. ఇండోనేషియా ఆర్థిక మంత్రి చేసిన ఒక వివాదాస్పద వ్యాఖ్య, అంతర్జాతీయ నౌకాయాన రంగాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఇరాన్ తన జలసంధిలో పన్నుల విధింపుతో ఎలాగైతే ప్రపంచాన్ని శాసిస్తోందో, అదే బాటలో ఇండోనేషియా కూడా నడవనుందా అనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ వంటి హర్మూజ్ జలసంధి ఉద్రిక్తతల కారణంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. వివరాల్లోకి వెళితే.. ఇండోనేషియా ఆర్థిక మంత్రి పూర్బయ యుధి సాదేవ్ ఇటీవల ఒక చర్చా వేదికపై మాట్లాడుతూ, తమ దేశ నియంత్రణలో ఉన్న మలక్కా జలసంధి గుండా ప్రయాణించే విదేశీ నౌకలపై 'టోల్' లేదా రవాణా రుసుము విధిస్తే దేశ ఖజానాకు భారీ ఆదాయం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు వెలువడిన వెంటనే అంతర్జాతీయ వాణిజ్య సంస్థలు, ముఖ్యంగా చైనా, జపాన్ వంటి తూర్పు ఆసియా దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఎందుకంటే ప్రపంచ చమురు రవాణాలో సుమారు నాలుగో వంతు ఈ 900 కిలోమీటర్ల పొడవైన సన్నని సముద్ర మార్గం ద్వారానే జరుగుతుంది. ఒకవేళ ఇండోనేషియా ఇక్కడ సుంకాలు విధిస్తే, అది అంతిమంగా వినియోగదారులపై పెను భారంగా మారుతుంది. ప్రపంచ దేశాల నుంచి ఒత్తిడి రావడంతో ఇండోనేషియా ప్రభుత్వం వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టింది. మలక్కా జలసంధి గుండా వెళ్లే నౌకలపై ఎలాంటి పన్నులు విధించే ఉద్దేశం ప్రస్తుతానికి లేదని, తమ దేశం ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందంకు కట్టుబడి ఉంటుందని అధికారికంగా స్పష్టం చేసింది. 2024తో పోలిస్తే 2025లో ఈ మార్గంలో నౌకల రాకపోకలు 94,300 నుంచి 1,02,500కు పైగా పెరగడం గమనార్హం. హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల చమురు సరఫరాలో ఇప్పటికే 20 శాతం అంతరాయం ఏర్పడిన తరుణంలో, మలక్కా వంటి కీలక మార్గంలో కూడా ఇలాంటి 'పన్నుల' చర్చ రావడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది. ఇండోనేషియా వివరణ ఇచ్చినప్పటికీ, రష్యా-ఉక్రెయిన్ ,ఇరాన్-అమెరికా యుద్ధాల నేపథ్యంలో దేశాలు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం అంతర్జాతీయ జలసంధులను ఆయుధాలుగా వాడుకునే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## H1-B వీసా మూడేళ్ల పాటు రద్దు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




అమెరికాలో ఉద్యోగం చేయాలనే కోట్లాది మంది భారతీయుల కలలపై అగ్రరాజ్యం మరోసారి నిరాశకు గురిచేసింది. హెచ్ 1బీ వీసా నిబంధనలను అత్యంత కఠినతరం చేస్తూ, రిపబ్లికన్ పార్టీకి చెందిన ఎంపీ ఎలీ క్రేన్ ''ఎండ్ హెచ్ 1బీ వీసా అబ్యూస్ యాక్ట్ 2026'' పేరుతో ఒక వివాదాస్పద బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు చట్టంగా మారితే, అమెరికా వెళ్లాలనుకునే సాఫ్ట్ వేర్ నిపుణులకు, అక్కడ ఇప్పటికే స్థిరపడిన ప్రవాస భారతీయులకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. అమెరికన్లకే ఉద్యోగాలు దక్కాలనే నినాదంతో వస్తున్న ఈ మార్పులు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఈ నూతన బిల్లులోని ప్రతిపాదనలు భారతీయ ఐటీ రంగాన్ని వణికించేలా ఉన్నాయి. దీని ప్రకారం, హెచ్ 1బీ ప్రోగ్రామ్‌ను ప్రారంభంలో మూడేళ్ల పాటు పూర్తిగా నిలిపివేస్తారు. ఆ తర్వాత తిరిగి ప్రారంభించినా, ప్రస్తుతం ఉన్న 65,000 వార్షిక వీసాల కోటాను ఏకంగా 25,000కు తగ్గించాలని ఎంపీ ఎలీ క్రేన్ ప్రతిపాదించారు. అంతేకాకుండా, దశాబ్దాలుగా కొనసాగుతున్న 'లాటరీ' విధానాన్ని రద్దు చేసి, కేవలం అత్యధిక వేతనం పొందే నిపుణులకే ప్రాధాన్యత ఇచ్చే 'వేజ్‌బేస్డ్' ఎంపిక పద్ధతిని ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ప్రకారం హెచ్ 1బీ ఉద్యోగులకు కనీసం $200,000 (సుమారు రూ.1.67 కోట్లు) వార్షిక వేతనం చెల్లించాల్సి ఉంటుంది. ఇంత భారీ వేతనం చెల్లించడం సంస్థలకు భారంగా మారుతుంది కాబట్టి, మధ్యస్థాయి ఐటీ నిపుణులకు అవకాశాలు దాదాపు మూసుకుపోతాయి. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ బిల్లు అంతర్జాతీయ విద్యార్థులకు వరప్రసాదమైన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతోంది. దీనివల్ల అమెరికాలో చదువుకున్న విద్యార్థులు అక్కడ పని అనుభవం పొందే అవకాశం కోల్పోతారు. హెచ్ 1బీ వీసాదారులు తమ కుటుంబ సభ్యులను (H4 వీసా ద్వారా) అమెరికాకు తీసుకురావడాన్ని కూడా ఈ బిల్లు అడ్డుకుంటుంది. గ్రీన్ కార్డ్ (శాశ్వత నివాస హోదా) కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కూడా రద్దు చేయాలని, ఒక వీసా నుంచి మరో వీసాకు మారాలంటే కచ్చితంగా అమెరికా వదిలి వెళ్లాలనే నిబంధనలు పెట్టడం గమనార్హం. ప్రస్తుతం అమెరికాలో ఉన్న 2.83 లక్షల మంది హెచ్ 1బీ వీసాదారుల్లో 70 శాతానికి పైగా భారతీయులే ఉన్నారు. గూగుల్, మెటా, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు భారతీయ నైపుణ్యంపైనే ఆధారపడుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ హయాం నుంచి వీసా ఫీజుల పెంపు, సోషల్ మీడియా తనిఖీలు, ఇంటర్వ్యూల వాయిదా వంటి చర్యలతో ఇబ్బందులు పడుతున్న భారతీయులకు, ఈ కొత్త బిల్లు మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ ఎలీ క్రేన్ ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు ఆండీ ఓగ్లెస్, గ్రెగ్ స్టూబ్ వంటి ఇతర ఎంపీల మద్దతు లభించి చట్టంగా మారితే, భారతీయుల అమెరికా కల ఒక పీడకలగా మారిపోయే ప్రమాదం ఉంది. ఐటీ రంగంలో ఇది పెను మార్పులకు, అవుట్‌సోర్సింగ్ పెరుగుదలకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

## భారతీయ వేషధారణలో ఇటలీ ప్రధాని

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోని రాజకీయ వేదికలపైనే కాకుండా, సోషల్ మీడియాలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. తాజాగా ఆమె ఎక్స్ వేదికగా పంచుకున్న ఒక ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. సాధారణంగా పాశ్చాత్య దుస్తుల్లో కనిపించే మెలోని, ఈసారి భారతీయ సంప్రదాయ శైలిని తలపించేలా భారీ 'ఝుమ్కాలు' (చెవిపోగులు) ధరించి కనిపించడంతో భారతీయ నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఈ "ఝుమ్కా మూమెంట్" రాజకీయ చర్చలను పక్కకు నెట్టి, ఫ్యాషన్ , జియోపాలిటిక్స్‌ను ఒకే చోటికి చేర్చింది. తన పోస్ట్‌లో మెలోని కేవలం ఫ్యాషన్ గురించే కాకుండా, ఇటలీ సార్వభౌమాధికారం ,స్వతంత్ర విదేశాంగ విధానంపై గంభీరమైన వ్యాఖ్యలు చేశారు. "మేము ఎవరి ప్రభావానికీ లోబడి లేము, మాకు యజమానులు లేరు. ఇటలీ ప్రయోజనాలే మా ఏకైక మార్గ దర్శక సూత్రం" అంటూ స్పష్టం చేశారు. ఆమె రాసిన శక్తివంతమైన క్యాప్షన్ కంటే, ఆ ఫోటోలో ఆమె ధరించిన పొడవాటి చెవిపోగులే భారతీయులను ఎక్కువగా ఆకట్టుకున్నాయి. కేవలం కొన్ని గంటల్లోనే ఈ ఫోటో వైరల్ కావడంతో, నెటిజన్లు బాలీవుడ్ పాపులర్ సాంగ్ "వాట్ ఝుమ్కా?" అంటూ మీమ్స్ తో సందడి చేస్తున్నారు. భారతదేశంలో ఈ ఫోటోపై వస్తున్న స్పందన చూస్తుంటే, మెలోనికి ఇక్కడ ఉన్న క్రేజ్ మరోసారి స్పష్టమవుతోంది. "ఈ ఝుమ్కాలు మీకు ఎవరు ఇచ్చారు?" అని కొందరు, "మీరు దేశీ స్టైల్‌లో చాలా బాగున్నారు" అని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రధాని మోదీతో ఉన్న స్నేహపూర్వక సంబంధాల నేపథ్యంలో, మెలోని ఇలాంటి భారతీయ శైలి ఆభరణాలను ఎంచుకోవడం భారత్ -ఇటలీ బంధాన్ని మరో కోణంలో ఆవిష్కరిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. తన రాజకీయ సందేశాన్ని దేశీ ఫ్యాషన్ టచ్‌తో కలిపి మెలోని చేసిన ఈ పోస్ట్, అటు ఇటలీలోనూ ఇటు భారత్‌లోనూ పెద్ద ఎత్తున వైరల్ అవుతూ 'టాక్ ఆఫ్ ది టౌన్'గా నిలిచింది.

## ముప్పును ముందే పసిగట్టి జయించా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



తన ఆరోగ్య స్థితిపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ, ముప్పును ముందే పసిగట్టి తుదముట్టించానని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ పేర్కొన్నారు. తనకు ప్రొస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, సరైన సమయంలో చికిత్స తీసుకోవడం ద్వారా దాని నుంచి తాను పూర్తిగా కోలుకున్నానని ఆయన వెల్లడించారు. యుద్ధం ముమ్మరంగా సాగుతున్న తరుణంలో, తన ఆరోగ్యంపై శత్రు దేశాలు, ఇరాన్ వంటి దేశాలు తప్పుడు ప్రచారం చేయకుండా ఉండేందుకే ఈ విషయాన్ని రెండు నెలల పాటు రహస్యంగా ఉంచినట్లు నెతన్యాహూ స్పష్టం చేశారు. నెతన్యాహూ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా వెల్లడించిన వివరాల ప్రకారం.. సుమారు ఏడాదిన్నర క్రితం ఆయన ప్రొస్టేట్ ఎన్‌లార్జ్ మెంట్ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటుండగా, ఇటీవల నిర్వహించిన చెకప్‌లో ప్రొస్టేట్‌లో ఒక సెంటీమీటర్ కంటే తక్కువ పరిమాణంలో ఉన్న ఒక చిన్న మచ్చను వైద్యులు గుర్తించారు. లోతుగా పరీక్షించగా అది మొదటి దశ క్యాన్సర్ ట్యూమర్‌గా తేలింది. అది శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించలేదని, తన వయస్సు గల వారిలో ఇది సాధారణంగా వచ్చే సమస్యేనని వైద్యులు ధృవీకరించారు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి తన ముందు రెండు మార్గాలు ఉన్నాయని నెతన్యాహూ పేర్కొన్నారు. ఒకటి, చికిత్స చేయకుండా కేవలం పర్యవేక్షణలో ఉండటం; రెండు, టార్గెటెడ్ ట్రీట్మెంట్ ద్వారా దాన్ని పూర్తిగా తొలగించుకోవడం. "దేశ భద్రత విషయంలోనైనా, వ్యక్తిగత ఆరోగ్యం విషయంలోనైనా ముప్పును ముందే పసిగట్టి, దాన్ని వెంటనే తుదముట్టించడమే నా విధానం" అని పేర్కొన్న ఆయన, రెండో మార్గాన్ని ఎంచుకుని చికిత్స పొందారు. ప్రస్తుతం క్యాన్సర్ పూర్తిగా నయమైందని, దేవుడి దయ వల్ల తాను శారీరకంగా పూర్తి దృఢంగా ఉన్నానని ప్రకటించారు. ఇజ్రాయెల్ ప్రజలు కూడా తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. యుద్ధ సమయంలోనే కాకుండా, వ్యక్తిగత పోరాటంలోనూ నెతన్యాహూ విజయం సాధించడం ఇజ్రాయెల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## బెర్లిన్ లో బహిష్కృత నేతపై దాడి


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



జర్మనీ రాజధాని బెర్లిన్‌లో పర్యటిస్తున్న ఇరాన్ మాజీ యువరాజు, ప్రవాస ప్రతిపక్ష నేత రెజా పహ్లవికి చేదు అనుభవం ఎదురైంది. గురువారం జరిగిన ఫెడరల్ ప్రెస్ కాన్ఫరెన్స్ ముగించుకుని బయటకు వస్తున్న సమయంలో, గుర్తుతెలియని వ్యక్తి ఒకరు ఆయనపై ఎర్రటి ద్రవాన్ని (టమాటో జ్యూస్ లేదా కెచప్) విసిరారు. ఈ ఆకస్మిక దాడిలో పహ్లవి కోటు వెనుక భాగం, మెడపై జ్యూస్ పడింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ నిందితుడిని అదుపులోకి తీసుకోగా, పహ్లవి చిరునవ్వుతో తన మద్దతుదారులకు అభివాదం చేస్తూ అక్కడి నుంచి కారులో వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దాడికి కొద్ది నిమిషాల ముందే ప్రెస్ కాన్ఫరెన్స్ లో మాట్లాడిన రెజా పహ్లవి.. ఇరాన్ పట్ల ఐరోపా దేశాలు అవలంబిస్తున్న మెతక వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఇరాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నా, రాజకీయ ఖైదీలను ఉరితీస్తున్నా యూరప్ దేశాలు కేవలం చూస్తూ ఉండిపోయాయని ఆగ్రహించారు. ముఖ్యంగా అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆయన తప్పుబట్టారు. "అరాచక శక్తులు రాత్రికి రాత్రే ప్రజాస్వామ్యవాదులుగా మారిపోతారని అనుకోవడం భ్రమ. దౌత్యానికి ఇప్పటికే తగినంత సమయం ఇచ్చారు, ఇకనైనా అంతర్జాతీయ సమాజం ఇరాన్ ప్రజల గొంతుక కావాలి" అని పిలుపునిచ్చారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమానికి మద్దతుగా పహ్లవి ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' (అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు) వల్ల ఖమేనీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతిన్నదని, ఇది ఇరాన్ విముక్తికి నాంది అని ఆయన విశ్వసిస్తున్నారు. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ ప్రభుత్వం తనను అధికారికంగా కలవకపోవడాన్ని 'అవమానకరం' అని పేర్కొన్న పహ్లవి, బెర్లిన్ వీధుల్లో తనపై జరిగిన దాడి తన పోరాటాన్ని ఆపలేదని స్పష్టం చేశారు. ఇరాన్ నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందే వరకు తన గళం వినిపిస్తూనే ఉంటానని ఆయన పునరుద్ఘాటించారు.

## యూరప్ పై రష్యా దాడి చేస్తే..యూఎస్ వస్తుందా ..?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




అమెరికా వైఖరిని నిరసిస్తూ పోలాండ్ ప్రధాన మంత్రి డొనాల్డ్ టస్క్ తీవ్రంగా స్పందించారు. 'ఫైనాన్షియల్ టైమ్స్'కు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అమెరికా విశ్వసనీయతను బహిరంగంగానే ప్రశ్నించారు. "అమెరికా నిజంగా నమ్మదగ్గదేనా? ఒకవేళ రష్యా దాడి చేస్తే, నాటో ఒప్పందం ప్రకారం అమెరికా, యూరప్‌ను రక్షించడానికి వస్తుందా?" అనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. కేవలం అమెరికాపైనే ఆధారపడకుండా, యూరప్ దేశాలన్నీ కలిసి ఒక బలమైన స్వతంత్ర రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. ఒకప్పుడు అమెరికా మాటే వేదంగా భావించిన నాటో మిత్రదేశాలు, అగ్రరాజ్యం తీసుకుంటున్న నిర్ణయాలపై బాహాటంగానే వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్‌పై యుద్ధం , హర్మూజ్ జలసంధిని పునరుద్ధరించే విషయంలో నాటో దేశాలు నేరుగా పాల్గొనేందుకు నిరాకరించడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తీవ్ర ఆగ్రహం కలిగించింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాటోను "కాగితపు పులి" అని అభివర్ణిస్తూ ఎద్దేవా చేశారు. 77 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ కూటమి నుంచి అమెరికా తప్పుకునే విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. గత ఏడాది రష్యాకు చెందిన సుమారు 23 డ్రోన్లు పోలాండ్ గగనతలంలోకి ప్రవేశించినప్పుడు నాటో స్పందించిన తీరును ఆయన విమర్శించారు. అప్పుడు ఆర్టికల్ 4ను ప్రయోగించినా, కొన్ని దేశాలు ఏమీ జరగనట్లే నటించాయని మండిపడ్డారు. రాబోయే కొద్ది నెలల్లోనే రష్యా ఏదైనా నాటో సభ్యదేశంపై దాడి చేసే అవకాశం ఉందని, కాగితాలపై ఉన్న ఒప్పందాల కంటే క్షేత్రస్థాయిలో ఆయుధ సంపత్తిని పెంచుకోవడమే మార్గమని టస్క్ హెచ్చరించారు.

**అమెరికా ఒత్తిడి:** ఇరాన్‌పై యుద్ధానికి సహకరించని దేశాలకు శిక్షలు తప్పవని, అవసరమైతే నాటో నుంచి బహిష్కరిస్తామని ట్రంప్ ప్రభుత్వం బెదిరిస్తోంది.

**యూరప్ ఆందోళన:** అమెరికా , ఇరాన్ యుద్ధంలో బిజీగా ఉన్న తరుణంలో, రష్యా తూర్పు యూరప్ దేశాలపై దాడి చేసే ప్రమాదం ఉందని నాటో మిత్రదేశాలు భయపడుతున్నాయి.

**రక్షణ నిధులు:** ఉక్రెయిన్ కోసం కేటాయించిన ఫ్యూర్ల్ నిధుల నుంచి కూడా తప్పుకుంటామని ట్రంప్ హెచ్చరించడంతో యూరప్ దేశాలు తమ సొంత రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచుకుంటున్నాయి.




## మెటాలో భారీ లేఆఫ్స్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

టెక్ రంగంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితి కొనసాగుతోంది. సామాజిక మాధ్యమ దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా మరోసారి ఊహించని రీతిలో భారీ స్థాయి ఉద్యోగ కోతలను ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ నిపుణులను దిగ్భ్రాంతికి గురిచేసింది. తన మొత్తం గ్లోబల్ వర్క్ ఫోర్స్‌లో సుమారు 10 శాతం మందిని, అంటే దాదాపు 8,000 మందిని ఇంటికి పంపేందుకు మార్క్ జుకర్‌బర్గ్ నేతృత్వంలోని ఈ సంస్థ సిద్ధమైంది. కేవలం ఉద్యోగులను తొలగించడమే కాకుండా, భవిష్యత్తులో భర్తీ చేయాలని భావించిన మరో 6,000 ఖాళీ పోస్టులను కూడా రద్దు చేస్తున్నట్లు మెటా చీఫ్ పీపుల్ ఆఫీసర్ జనెల్ గేల్ అంతర్గత మెమోల ద్వారా స్పష్టం చేశారు. ఈ నిర్ణయం టెక్ ప్రపంచంలో సంచలనంగా మారింది. మెటా తీసుకున్న ఈ కఠిన నిర్ణయానికి ప్రధాన కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నెలకొన్న తీవ్రమైన పోటీ అని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏఐ ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో, ఆ రంగంలో ఆధిపత్యాన్ని సాధించేందుకు అవసరమైన నిధులను సమీకరించుకోవడానికి మెటా తన వ్యూహాలను మారుస్తోంది. అదనపు ఖర్చులను తగ్గించుకుని, ఆ నిధులను ఏఐ ప్రాజెక్టులలో పెట్టుబడిగా మళ్లించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లేఆఫ్స్ ప్రక్రియ మే 20 నుంచి అధికారికంగా ప్రారంభం కానుంది. ప్రభావితమయ్యే ఉద్యోగులకు వారి వ్యక్తిగత పని ఇ-మెయిల్ ఐడీలకు నోటీసులు పంపబడతాయి. విశ్లేషకుల అంచనా ప్రకారం, రానున్న రోజుల్లో ఈ లేఆఫ్స్ సంఖ్య 20 శాతానికి పెరిగే ప్రమాదం ఉంది, అంటే మరో 8 వేల మందిపై వేటు పడవచ్చు. తొలగించబడిన ఉద్యోగుల పట్ల మానవీయ దృక్పథంతో మెటా కొన్ని పరిహార ప్యాకేజీలను ప్రకటించింది. బాధితులకు 16 వారాల ప్రాథమిక వేతనంతో పాటు, వారు సంస్థలో పనిచేసిన ప్రతి ఏడాదికి అదనంగా రెండు వారాల వేతనం లభిస్తుంది. దీనితో పాటు 18 నెలల పాటు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కొనసాగుతుంది. ఆయా దేశాల్లోని కార్మిక చట్టాలను అనుసరించి పూర్తిస్థాయి నష్టపరిహారం అందిస్తామని మెటా హామీ ఇచ్చింది. గతేడాది కూడా వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించిన మెటా, ఇప్పుడు మళ్ళీ అదే బాట పట్టడం చూస్తుంటే.. భవిష్యత్తులో టెక్ కంపెనీలు మానవ వనరుల కంటే కృత్రిమ మేధకే అత్యధిక ప్రాధాన్యతనిస్తాయనే చేదు నిజం స్పష్టమవుతోంది. ఏఐ యుగంలో మనుషుల అవసరం తగ్గుతుందనే సంకేతాన్ని ఈ చర్య బలంగా ఇస్తోంది.

## ట్రంప్ 'నరకం' వ్యాఖ్యలకు
## ఇరాన్ కౌంటర్


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




భారత్-చైనాలను 'నరకం'తో పోలుస్తూ అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ పోస్ట్‌ను ట్రంప్ రీపోస్ట్ చేయడంపై భారతీయుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుండగా, ఇరాన్ అనూహ్యంగా భారత్‌కు అండగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీశాయి. ముంబయిలోని ఇరాన్ ఎంబసీ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ట్రంప్‌కు భారత దేశ గొప్పదనాన్ని చాటిచెప్పేలా సోషల్ మీడియా వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చింది. ఒక అగ్రరాజ్య నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది. ముంబయిలోని ఇరాన్ ఎంబసీ తన అధికారిక పోస్ట్ లో.. "భారత్‌లోని అపారమైన అభివృద్ధిని, అక్కడి ఉన్నతమైన సాంస్కృతిక విలువలను డొనాల్డ్ ట్రంప్‌కు ఎవరైనా వివరిస్తే బాగుంటుంది. ఆయనను ఒక్కసారి భారత పర్యటనకు తీసుకువస్తే ఇక్కడి వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయి" అని హితవు పలికింది. కేవలం మాటలతోనే సరిపెట్టకుండా, మహారాష్ట్రలోని అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు , సంప్రదాయ వేడుకలకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను షేర్ చేసింది. భారత్‌ను నరకంతో పోల్చే ముందు ఇక్కడికి వచ్చి ప్రత్యక్షంగా చూడాలని సూచించింది. అమెరికాలో 'జన్మతః పౌరసత్వ చట్టం'పై జరుగుతున్న చర్చలో భాగంగా ట్రంప్ ఈ వివాదాస్పద పోస్ట్‌ను పంచుకోవడం గమనార్హం. మరోవైపు హైదరాబాద్‌లోని ఇరాన్ ఎంబసీ కూడా ఈ విషయంలో అత్యంత ఘాటుగా స్పందించింది. "భారత్, చైనాలు ప్రపంచానికే మహోన్నత నాగరికతలను అందించిన దేశాలు. ఇలాంటి గొప్ప దేశాలను నరకంతో పోల్చడం కంటే, ఇరాన్ వంటి పురాతన నాగరికతను నాశనం చేస్తామని గతంలో బెదిరించిన ఒక యుద్ధ నేరస్థుడైన అధ్యక్షుడు ఉండటమే అసలైన నరకం" అంటూ ట్రంప్‌పై విమర్శలు గుప్పించింది. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, భారత్‌కు మద్దతుగా ఇరాన్ ఎంబసీలు ఈ స్థాయిలో స్పందించడం దౌత్య వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. భారత దేశ గౌరవాన్ని తక్కువ చేసేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదనే సంకేతాన్ని ఈ పోస్ట్ లు స్పష్టం చేస్తున్నాయి.

## ఇస్లామాబాద్‌కు ఇరాన్
## విదేశాంగ మంత్రి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



అమెరికా-ఇరాన్ మధ్య మలి విడత చర్చలపై ప్రపంచం చూపు పాకిస్తాన్ వైపు మళ్లింది. రెండు దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు ఇస్లామాబాద్ వేదికగా జరుగుతున్న ప్రయత్నాలు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ శుక్రవారం ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో కలిసి పాకిస్తాన్ కు చేరుకోనున్నారు. అగ్రరాజ్యం అమెరికాతో మలివిడత చర్చలు జరిపి, శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైపు నుంచి తీవ్రమైన హెచ్చరికలు వస్తున్నప్పటికీ, ఈ పర్యటన చర్చల పునరుద్ధరణకు సంకేతంగా కనిపిస్తోంది. అరాగ్చీ తన పర్యటనకు ముందే పాకిస్తాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ , పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌తో ఫోన్‌లో సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటికే అమెరికాకు చెందిన దౌత్య బృందాలు ఇస్లామాబాద్‌లో మకాం వేయడం, ఇరాన్ మంత్రి స్వయంగా రావడం చూస్తుంటే సోమవారం జరగాల్సిన మలి విడత చర్చలు సజావుగానే సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేవలం ద్వైపాక్షిక అంశాలే కాకుండా, హర్మూజ్ జలసంధి పునరుద్ధరణ , ప్రాంతీయ భద్రతపై ఈ పర్యటనలో నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. ఇరాన్ మీడియా కూడా అరాగ్చీ పర్యటన కాల్పుల విరమణ దిశగా ఒక సానుకూల అడుగు అని అభివర్ణిస్తోంది. ఒకవైపు యుద్ధ మేఘాలు, మరోవైపు శాంతి చర్చలతో ఇస్లామాబాద్ అంతర్జాతీయ రాజకీయాలకు కేంద్రబిందువుగా మారింది.

మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
25.04.2026
www.manasarkar.com



## ఏపీలో తీరనున్న ఇంధన కష్టాలు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న ఇంధన కొరతను పరిష్కరించేందుకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు చొరవతో ఆయిల్ కంపెనీలు రాష్ట్రానికి ఇంధన సరఫరాను పెంచేందుకు అంగీకరించాయి. దీంతో గత కొన్ని రోజులుగా పెట్రోల్ బంకుల వద్ద నిల్వలు లేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు పెద్ద ఉపశమనం లభించనుంది. ఇటీవల ఆయిల్ కంపెనీలు సరఫరాను తగ్గించడంతో రాష్ట్రవ్యాప్తంగా అనేక బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు వెలిశాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ కన్నబాబు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్ , వివిధ చమురు కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ చర్చల ఫలితంగా, ప్రస్తుత డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ నెలలో అదనంగా 10% ఇంధనాన్ని సరఫరా చేసేందుకు కంపెనీలు అంగీకరించాయి. సరఫరా పెరగనున్న నేపథ్యంలో ఇకపై రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉండదని పెట్రోలియం ట్రేడర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. స్టాక్ అయిపోతుందనే ఆందోళనతో ప్రజలు బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని, త్వరలోనే అన్ని ప్రాంతాల్లో లభ్యత సాధారణ స్థితికి వస్తుందని భరోసా ఇచ్చారు. పంపిణీలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇంధన పంపిణీలో ఏవైనా ఆటంకాలు ఎదురైనా లేదా సరఫరాలో జాప్యం జరిగినా డీలర్లు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ సూచించింది. వినియోగదారులు లేదా డీలర్లు ఎవరైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే 1967 అనే టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేయవచ్చని అధికారులు తెలిపారు. ప్రభుత్వ చొరవతో రానున్న రెండు, మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సరఫరా పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించబడనుంది.




## దమ్ముంటే జగన్‌పై నేరుగా యుద్ధం చెయ్

**వేంపల్లి (ఏడీఎన్ఎన్) :**

తెలుగుదేశం పార్టీ నేతలు అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడుతున్నారని, కూటమి ప్రభుత్వం తప్పుడు అజెండాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వైసీపీ ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి మండిపడ్డారు. వేంపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు, ఎల్లో మీడియా తీరుపై నిప్పులు చెరిగారు. పెద్ద దస్తగిరి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదును కూడా పట్టించుకోకుండా 'ఈనాడు' పత్రిక నీచమైన కథనాలు రాస్తోందని సతీష్ రెడ్డి ఆరోపించారు. "చంద్రబాబు ఆపదలో ఉన్నప్పుడల్లా ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తప్పుడు రాతలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తాయి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారికి, వైసీపీకి లేని లింకులు పెడుతూ కథనాలు అల్లడం అన్యాయం. ఆంధ్రజ్యోతి అంటే చంద్రబాబు, ఆంధ్రజ్యోతి అంటే టీడీపీ అని రాష్ట్రంలో అందరికీ తెలుసు," అని ఆయన ధ్వజమెత్తారు. తప్పుడు కథనాలు కాకుండా దమ్ముంటే జగన్ మీద నేరుగా యుద్ధం చేయాలని చంద్రబాబుకు సవాల్ విసిరారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే చంద్రబాబు నీచ రాజకీయాలకు తెరలేపారని సతీష్ రెడ్డి విమర్శించారు. "మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నేతలు తమలో తాము చంపుకుంటే.. దాన్ని వైసీపీకి ఆపాదించి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మీద అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు దస్తగిరి హత్య విషయంలోనూ అదే పంథాను అనుసరిస్తున్నారు. నిత్యానింద రెడ్డికి దస్తగిరిని హత్య చేయాల్సిన అవసరం ఏముంది?," అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న వరుస హత్యలకు, శాంతిభద్రతల క్షీణతకు నైతిక బాధ్యత వహిస్తూ ఏ1గా చంద్రబాబు నాయుడుపైనే కేసులు పెట్టాలని సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబు చేస్తున్న తప్పులను దేవుడు లెక్కిస్తున్నాడని, సరైన సమయంలో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం హత్యలను ప్రోత్సహిస్తూ, ప్రత్యర్థులపై బురద చల్లడం చంద్రబాబు నైజమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## లిక్కర్ నిందితులకు ఏసీబీ కోర్టు షాక్!

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అటు న్యాయస్థానాల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో శుక్రవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో ప్రధాన నిందితులకు కోర్టులో చుక్కెదురు కాగా, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తన రాజకీయ పునరాగమనంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న నిందితులు ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పలకు విజయవాడ ఏసీబీ కోర్టులో గట్టి షాక్ తగిలింది. తమకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వీరు దాఖలు చేసిన పిటిషన్లపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత , కేసు విచారణ కీలక దశలో ఉన్నందున బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేస్తూ, నిందితుల పిటిషన్లను కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో వీరు మరికొంత కాలం జైలులోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, లిక్కర్ స్కామ్ కేసు దర్యాప్తులో భాగంగా తన నివాసంలో ఈడీ సోదాలు ముగిసిన తర్వాత మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. వచ్చే జులై నెల నుంచి తాను మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. కేవలం రాజకీయాల్లోకే కాకుండా, త్వరలోనే మీడియా రంగంలోకి కూడా అడుగుపెడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ తీరుపై విమర్శలు సంధిస్తూ, గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించడం విశేషం. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. తన నివాసంలో జరిగిన ఈడీ సోదాలపై స్పందిస్తూ.. అధికారులు తన వద్ద ఎటువంటి ఆధారాలు సేకరించలేకపోయారని, తన వద్ద ఏమీ దొరకలేదని స్పష్టం చేశారు. అయితే, విచారణలో భాగంగా ఈడీ తనను మళ్లీ పిలిచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు వైసీపీలో , రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

## ఫేక్ వీడియోలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానవతా దృక్పథంతో ఇచ్చిన ఒక హామీని వక్రీకరించి, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై రాష్ట్ర ఐటీ , విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియోలను ఎడిట్ చేసి, అసత్యాలను ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా తమ నీచపు అలవాట్లను మార్చుకోవడం లేదని విమర్శించారు. మార్చి 30న తిరుపతి జిల్లా నాయుడుపేటలో జరిగిన టిడ్కో ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అక్కడ ముక్కర అంబిక అనే లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లిన సీఎం, ఆమె భర్త ఆటో డ్రైవర్ అని తెలుసుకున్నారు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబానికి మెరుగైన జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో, వారికి ఒక 'బ్యాటరీ ఆటో' మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను అక్కడికక్కడే ఆదేశించారు. ఇది ఒక ఆటో డ్రైవర్ కుటుంబానికి ప్రభుత్వం అందించిన భరోసా. అయితే, సీఎం ఆ ఇంటి నుంచి బయటకు వస్తుండగా.. ఎదురుగా ఉన్న మరో మహిళ తన చదువుకున్న కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఈ రెండు వేర్వేరు సంఘటనలను కలిపి, 'చదువుకున్న యువకుడికి సీఎం ఆటో కొనిపిస్తారట' అంటూ అపహాస్యం చేస్తూ కొందరు కావాలని ఎడిట్ చేసిన వీడియోలను సోషల్ మీడియాలో వదిలారు. దీనిపై గతంలోనే ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం క్లారిటీ ఇచ్చినప్పటికీ, మళ్లీ అదే అబద్ధాన్ని ప్రచారం చేయడం దురుద్దేశపూర్వకమని లోకేశ్ మండిపడ్డారు. "ముఖ్యమంత్రి గారు పేదవారికి చేస్తున్న సహాయాన్ని కూడా రాజకీయం చేయడం దారుణం. వీడియోలను మార్ఫింగ్ చేసి, తప్పుడు అర్థం వచ్చేలా ప్రచారం చేయడం చట్టరీత్యా నేరం" అని లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి ఫేక్ ప్రచారాలకు పాల్పడే వారిని వదిలే ప్రసక్తే లేదని, ఇప్పటికే సంబంధిత విభాగాలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా విషం చిమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## 'డేటా ఎవాల్వ్'కు సుప్రీం నోటీసులు..

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ట్రాఫిక్ ఈచలానాల వసూళ్లు నిధుల మళ్లింపునకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రముఖ 'డిజియాత్ర' యాప్‌ను రూపొందించిన 'డేటా ఎవాల్వ్' సంస్థకు వ్యతిరేకమైన ఆర్బిట్రేషన్ ఆదేశాలపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. ఈ మేరకు సంస్థకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మే 25వ తేదీకి వాయిదా వేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి , డేటా ఎవాల్వ్ సంస్థకు మధ్య 2018 నుంచి 2021 వరకు ట్రాఫిక్ ఈచలానాల నిర్వహణకు సంబంధించి ఒప్పందం కుదిరింది. అయితే, మూడేళ్ల కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా సదరు సంస్థ అక్రమంగా చలాన్లను వసూలు చేస్తూనే ఉందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేవలం కాంట్రాక్టు గడువును అడ్డుపెట్టుకొని సుమారు రూ. 37 కోట్ల రూపాయలను ప్రభుత్వ ఖజానాకు చేరకుండా సొంత ఖాతాలకు మళ్లించారని ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఒప్పందం ముగిసిన తర్వాత కూడా డేటా ఎవాల్వ్ సంస్థ నిధులను మళ్లించడం తీవ్రమైన ఉల్లంఘన అని కోర్టుకు వివరించారు. గతంలో ఈ వ్యవహారంపై వచ్చిన ఆర్బిట్రేషన్ ఆదేశాలను సవాలు చేస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని విన్నవించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, తక్షణమే ఆర్బిట్రేషన్ ఆదేశాలపై స్టే విధిస్తూ నిర్ణయం తీసుకుంది. డేటా ఎవాల్వ్ సంస్థ కేవలం ట్రాఫిక్ చలాన్ల నిర్వహణే కాకుండా, విమానాశ్రయాల్లో ఉపయోగించే 'డిజియాత్ర' సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలోనూ భాగస్వామిగా ఉంది. అటువంటి సంస్థపై నిధుల మళ్లింపు వంటి తీవ్రమైన ఆరోపణలు రావడం మరియు సుప్రీంకోర్టు స్టే విధించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మే 25న జరగబోయే తదుపరి విచారణలో ఈ నిధుల రికవరీ మరియు సంస్థపై తీసుకోవాల్సిన చర్యలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## రాష్ట్రంలో వ్యవసాయ శాఖా మంత్రి ఉన్నారా?

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై వైఎసీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాడేపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి 'డైవర్షన్ రాజకీయాలు' చేస్తున్నారని మండిపడ్డారు. "రాష్ట్రంలో అసలు వ్యవసాయ శాఖా మంత్రి ఉన్నారా?," అని శైలజానాథ్ నిలదీశారు. మొక్కజొన్న, ధాన్యం, పత్తి, మిర్చి.. ఇలా ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర దక్కడం లేదని, రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని డప్పు కొట్టుకునే నేతలు, కేంద్రం నుండి రాష్ట్రానికి ఏం తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యలను పక్కదారి పట్టించేందుకే తిరుమల లడ్డూ వంటి అంశాలపై ఏళ్ల తరబడి అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. పదో తరగతి పరీక్ష పేపర్ల స్పాట్ వాల్యూయేషన్ కూడా సరిగా చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులను విద్యాసంస్థలు వేధిస్తున్నాయి. హాస్టళ్ల దుస్థితి, నిరుద్యోగ సమస్య, మంచినీటి ఎద్దడితో జనం అల్లాడిపోతున్నారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి," అని ఆయన ఆరోపించారు. ప్రజల ఆస్తులను దోచుకోవడమే చంద్రబాబు దృష్టిలో సంపద సృష్టించడమా? అని ప్రశ్నించారు. రాయలసీమ రైతులు సాగునీటి కోసం అల్లాడుతుంటే, ప్రభుత్వం మాత్రం అమరావతిలో నీటిని తోడటానికే కోట్లు ఖర్చు చేస్తోందని శైలజానాథ్ విమర్శించారు. "లక్షల కోట్లు అప్పులు తెచ్చి అమరావతిలో పోస్తున్నారు. ఆ అప్పుల భారం రాయలసీమ వాసుల మీద పడుతోంది. అమరావతిపై పెట్టే ఖర్చులో కొంత రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అయ్యేది," అని పేర్కొన్నారు. రాష్ట్రంలో యథేచ్ఛగా భూదోపిడీ జరుగుతోందని, దేవాదాయ భూములను సైతం పరిశ్రమలకు ఎలా కేటాయిస్తారని ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలు, దళితులపై జరుగుతున్న దాడులపై చర్చించేందుకు తక్షణమే 'ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 'మావిగన్' ప్రతిపాదనకు సమాధానం చెప్పలేక, కేవలం దూషణలకు దిగడం చంద్రబాబు నైజమని శైలజానాథ్ విమర్శించారు.

## గెలిపించడానికి ఎస్సీలు కావాలి.. అధికారంలో ఉంటే తొక్కేస్తారా?

**చిత్తూరు (ఏడీఎన్ఎన్) :**



జీడి నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే థామస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలపై వివక్ష చూపుతున్నారంటూ ఆయన బహిరంగంగానే తన ఆవేదనను, ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. రాజకీయాల్లో ఎస్సీలను కేవలం ఓటు బ్యాంకుగా, బానిసలుగానే చూడాలనుకుంటున్నారా? అని ఆయన నిలదీశారు. కొందరు నాయకుల్లో ఎస్సీల పట్ల ఉన్న చులకన భావాన్ని ఆయన మీడియా ముఖంగా శుక్రవారం ఎండగట్టారు. "ఎస్సీలు ఎన్నికల్లో ఖర్చు పెట్టాలి, పార్టీని గెలిపించాలి.. అప్పుడు మేము కావాలి. కానీ గెలిచి అధికారంలోకి వచ్చాక ఎస్సీ ఎమ్మెల్యేలు అధికారం చెలాయించకూడదా? వారిని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? ఎందుకు తొక్కేయాలని చూస్తున్నారు?," అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎస్సీ ఎమ్మెల్యేలను ఇబ్బందులకు గురిచేయడం వెనుక ఉన్న కుట్రలను ఆయన తీవ్రంగా ఖండించారు. "ఎస్సీలు ఎప్పుడూ ఇతరుల కాళ్లు పట్టాలి, బానిసలుగానే పడి ఉండాలి అనుకోవడం కరెక్ట్ కాదు. ఇదెక్కడి న్యాయం? ప్రజాస్వామ్యంలో అందరూ సమానమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి," అని హెచ్చరించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు స్వేచ్ఛగా పనిచేసే అవకాశం లేకుండా చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే థామస్ చేసిన ఈ వ్యాఖ్యలు నేరుగా ఎవరిని ఉద్దేశించి చేసినవి? ప్రభుత్వంలో లేదా పార్టీలో ఆయన ఎదుర్కొంటున్న ఇబ్బందులేమిటి? అనే అంశాలపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే తన సామాజిక వర్గం పట్ల జరుగుతున్న అన్యాయంపై ఇంత ఘాటుగా స్పందించడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాఖ్యలపై అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## టీడీపీ - జనసేన నేతల మధ్య 'రొయ్యల' గొడవ

**మైలవరం (ఏడీఎన్ఎన్) :**



ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో రొయ్యల చెరువు లీజు వ్యవహారం అధికార కూటమి నేతల మధ్య చిచ్చు పెట్టింది. టీడీపీ, జనసేన నాయకులు ఒకరిపై ఒకరు దాడులకు దిగడమే కాకుండా, పోలీస్ స్టేషన్ సాక్షిగా బూతుపురాణం విప్పుకుంటూ గొడవకు దిగడం స్థానికంగా కలకలం సృష్టించింది. మైలవరం పరిధిలోని ఒక రొయ్యల చెరువును రంగారావు అనే వ్యక్తి యాజమాన్యం వద్ద లీజుకు తీసుకున్నారు. ప్రస్తుతం రొయ్యల విక్రయం జరుగుతున్న తరుణంలో, లీజు డబ్బుల చెల్లింపు విషయంలో టీడీపీ నేత రేగళ్ల శ్రీను అడ్డు తగిలారు. రంగారావు నుంచి లీజు డబ్బులను శ్రీను బలవంతంగా లాక్కున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. రేగళ్ల శ్రీను తీరుపై బాధితుడు రంగారావు.. రాష్ట్ర వడ్డీల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ ఘంటశాల వెంకటలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఈ విషయంపై నిలదీసేందుకు, ఫిర్యాదు చేసేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న రేగళ్ల శ్రీను అనుచరులు పెద్ద ఎత్తున స్టేషన్ వద్దకు చేరుకుని వెంకటలక్ష్మితో గొడవకు దిగారు. పోలీసుల ముందే ఆమెను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, భౌతిక దాడికి పాల్పడటం గమనార్హం. కూటమిగా ఉండి ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన నేతలు, ఇలా బహిరంగంగా కొట్టుకోవడంపై జిల్లాలోని ఇతర నేతలు మండిపడుతున్నారు. ఈ ఘటన కూటమి పరువును బజారున పడేసిందని, విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఈ ఘటనపై వైసీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నాయి. "రొయ్యల చెరువుల పేరుతో కూటమి నేతలు దోపిడీలకు పాల్పడుతున్నారు. లీజు డబ్బుల కోసం సొంత మనుషులపైనే దాడులు చేసుకుంటున్నారంటే ఇక్కడ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు" అని ఎద్దేవా చేస్తున్నారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం పరిసరాల్లో ఈ వివాదం హాట్ టాపిక్ గా మారింది.



## అనంతబాబు అరెస్టు

**రాజమహేంద్రవరం (ఏడీఎన్ఎన్) :**

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం కోర్టు ఆవరణలో శుక్రవారం ఈ హైడ్రామా చోటు చేసుకుంది. సాక్షులను బెదిరించారనే అభియోగంపై పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. తనపై నమోదైన హత్య కేసులో బెయిల్ రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ నిమిత్తం అనంతబాబు, తన భార్య లక్ష్మీదుర్గతో కలిసి రాజమహేంద్రవరం కోర్టుకు హాజరయ్యారు. విచారణ ముగించుకుని ఆయన కోర్టు హాల్ నుంచి బయటకు రాగానే, అక్కడ అప్పటికే మాటు వేసిన పోలీసులు ఆయనను చుట్టుముట్టారు. సాక్షులను ప్రభావితం చేస్తున్నారనే కొత్త కేసులో ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, వెంటనే వాహనంలో ఎక్కించి తీసుకువెళ్లారు. అరెస్టు చేసిన తర్వాత పోలీసులు అనంతబాబును కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారిని అనంతబాబు , ఆయన అనుచరులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, బెయిల్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని బాధితుడి కుటుంబ సభ్యులు గతంలోనే ఆరోపించారు. ఈ ఫిర్యాదుల ఆధారంగానే పోలీసులు ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ అరెస్టు నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజమహేంద్రవరం కోర్టు సముదాయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. అనంతబాబు అనుచరులు మరియు వైసీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గత కొంత కాలంగా వివాదాలకు కేంద్రబిందువుగా ఉన్న అనంతబాబు చుట్టూ ఇప్పుడు చట్టం ఉచ్చు మరింత బిగుస్తోంది.



## వైసీపీ ఒత్తిడితో దిగొచ్చిన ఖాకీలు

**రంగంపేట (ఏడీఎన్ఎన్) :**

తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో వైసీపీ ఎంపీటీసీ భర్త వెంకట్రావు నిర్బంధం వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం సృష్టించింది. తొలుత తమకేమీ తెలియదని బుకాయించిన పోలీసులు, వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో చివరకు దిగివచ్చారు. వెంకట్రావు తమ అదుపులోనే ఉన్నారని, కుటుంబ సభ్యులకు ఆయన్ను చూపిస్తామని హామీ ఇవ్వడంతో గంటల తరబడి సాగిన ఉత్కంఠకు తెరపడింది. దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి భర్తను పట్టపగలే తీసుకెళ్లి, ఏమీ తెలియదని అబద్ధాలు చెప్పడం పోలీసు వ్యవస్థకే సిగ్గుచేటని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మండిపడ్డారు. వెంకట్రావును పోలీసులు భౌతికంగా హింసించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని, బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి పాలనలో జరుగుతున్న ఈ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో అసలు శాంతిభద్రతలు అనేవే లేవని మాజీ హోం మంత్రి తానేటి వనిత విమర్శించారు. పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ దళిత కుటుంబాలను వేధించడం అత్యంత దారుణమని ధ్వజమెత్తారు. "ఒక ప్రజాప్రతినిధి కుటుంబానికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటి?," అని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై విచారణ జరిపి, వెంకట్రావును హింసించిన సీఐను తక్షణమే సస్పెండ్ చేయాలని వైసీపీ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైసీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ స్పష్టం చేశారు. పోలీసులు అధికార పార్టీ కళ్లద్దాలతో చూడటం మానుకోవాలని హితవు పలికారు. నిరసనలు ఉధృతం చేసే వరకూ నిజం ఒప్పుకోకపోవడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమని పార్టీ నేతలు మండిపడుతున్నారు.

## హత్యా రాజకీయాలకు 'పెద్ద దస్తగిరి' హత్యే పరాకాష్ట

**మంగళగిరి (ఏడీఎన్ఎన్) :**



వైసీపీ హత్యా రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయని, పార్టీ కోసం పనిచేసిన వ్యక్తినే హతమార్చే స్థాయికి ఆ పార్టీ దిగజారిందని మైనార్టీ ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ తీవ్ర విమర్శలు చేశారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న జరిగిన పెద్ద దస్తగిరి హత్య వెనుక ఉన్న దిగ్భ్రాంతికర వాస్తవాలను వెల్లడించారు. "గతంలో వివేకానందరెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లే, పెద్ద దస్తగిరి హత్యను కూడా 'గంజాయి ముఠా గొడవ'గా మార్చేందుకు కుట్రలు చేశారు," అని షరీఫ్ ఆరోపించారు. పోలీసుల విచారణ పూర్తికాకముందే 'సాక్షి' పత్రికలో బ్యానర్ కథనాలు ప్రచురించడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూశారని మండిపడ్డారు. అయితే పోలీసుల ప్రాథమిక విచారణలో ఇది గంజాయి గొడవ కాదని, భారీ స్థాయిలో జరిగిన భూవివాదాలు , ఆస్తి లావాదేవీలే ఈ హత్యకు ప్రధాన కారణమని తేలిందని ఆయన వివరించారు. హత్యకు గురైన దస్తగిరి నివాసంలో పోలీసులకు 150కి పైగా దస్తావేజులు లభించాయని, సుమారు రూ. 500 కోట్ల విలువైన ఆస్తుల లావాదేవీల చుట్టూ ఈ వ్యవహారం తిరుగుతోందని షరీఫ్ వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కడప మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి ఇప్పటికీ పరారీలో ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. హత్య చేసిన వారే బాధితుడి ఇంటికి వెళ్లి కన్నీళ్లు కార్చడం అత్యంత హేయమైన రాజకీయ నాటకమని ఆయన విమర్శించారు. భర్తను కోల్పోయి న్యాయం కోసం పోరాడుతున్న దస్తగిరి భార్య భావోద్వేగాలను కూడా వైసీపీ రాజకీయాల కోసం వాడుకుంటోందని షరీఫ్ దుయ్యబట్టారు. ఆమె పార్టీకి 'క్లీన్ చిట్' ఇచ్చిందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం తప్పుడు ప్రచారమని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాల్సింది పోయి, ఇలాంటి వక్రీకరణలకు పాల్పడటం దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిందితులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని షరీఫ్ స్పష్టం చేశారు.



# రైతులకు భరోసా కల్పించండి

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):

తెలంగాణలో రైతు సంక్షేమ పథకాల అమలుపై రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ప్రస్తుతం రైతులకు అందిస్తున్న పథకాల విషయంలో ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రైతు భరోసాతో పాటు పంటలకు బోనస్ అందించడం వంటి బహుళ విధానాల వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం విపరీతంగా పెరుగుతోందని, దీనివల్ల ఏ పథకం కూడా సంపూర్ణంగా రైతులకు చేరడం లేదని ఆయన గుర్తు చేశారు.కేవలం పంటల బోనస్ కోసమే ప్రభుత్వం సుమారు రూ. 2 వేల కోట్లు ఖర్చు చేస్తోందని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. మరోవైపు రైతు భరోసా నిధులు సకాలంలో, సంపూర్ణంగా అందడం లేదన్న అసంతృప్తి రైతుల్లో బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. నిధుల కొరత , అమలులో జరుగుతున్న జాప్యం వల్ల ప్రభుత్వం ఆశించిన ఫలితం రావడం లేదని, రైతులు అయోమయానికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన కొన్ని కీలక సూచనలు చేశారు. రైతు భరోసా లేదా పంటల బోనస్.. ఈ రెండింటిలో ఏదో ఒక దానిని ఎంచుకుని, దానిని పకడ్బందీగా రైతులకు అందజేయాలని సూచించారు. రెండు పథకాలను అరకొరగా అమలు చేయడం కంటే, ఒకే పథకాన్ని పూర్తిగా అమలు చేయడం వల్ల అటు ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుందని, ఇటు రైతులకు కూడా స్పష్టత ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.రైతులను సంతృప్తి పరిచే విధంగా ప్రభుత్వం వీలైనంత త్వరగా తన విధానాన్ని ప్రకటించాలని గుత్తా కోరారు. ఒకేసారి రెండు వైపులా నిధులు వెచ్చించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందనే కోణంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మరి మండలి చైర్మన్ చేసిన ఈ సూచనలపై రేవంత్ సర్కార్ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.



# ఔషధ రంగంలో తెలంగాణ గ్లోబల్ లీడర్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఔషధ తయారీ , ఆరోగ్య సంరక్షణ రంగాల్లో తెలంగాణ రాష్ట్రం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కొనియాడారు. హైటెక్స్ లో శుక్రవారం జరిగిన 'ఇండియా ఫార్మా ఎక్స్ పో2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లు, మందులను సరఫరా చేసి తెలంగాణ తన సత్తా చాటుకుందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,500కు పైగా ఏపీఐ, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీ యూనిట్లు ఉండటం మన పారిశ్రామిక శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు.ఔషధ రంగంలో చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా అది అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠపై ప్రభావం చూపుతుందని మంత్రి హెచ్చరించారు. నాణ్యత, భద్రత, పారదర్శకత విషయంలో తయారీదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారే నకిలీ, నాసిరకం మందుల తయారీదారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.హైదరాబాద్ వేదికగా ఉన్న ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, వైద్యులు, పారిశ్రామికవేత్తలే రాష్ట్ర విజయానికి మూలస్తంభాలని మంత్రి అన్నారు. ఫార్మా ఎక్స్ పో వంటి వేదికలు కేవలం ప్రదర్శనలకు మాత్రమే పరిమితం కాకుండా, కొత్త ఆలోచనలు , పరిశోధనలకు వారధిగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణలో ఫార్మా రంగాన్ని మరింత విస్తరించేందుకు, పరిశ్రమలకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.తర్వాత ఎక్స్ పోలో ఏర్పాటు చేసిన వివిధ ఫార్మా , అనుబంధ కంపెనీల స్టాళ్లను మంత్రి సందర్శించారు. అత్యాధునిక సాంకేతికతను వాడుతున్న సంస్థల ప్రతినిధులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మరియు విజేతలుగా నిలిచిన సంస్థలకు మంత్రి ఈ సందర్భంగా అవార్డులను అందజేశారు. రాష్ట్రం మెడికల్ హబ్‌గా ఎదగడంలో పారిశ్రామికవేత్తల కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఖబడ్దార్

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ నాయకులు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజా ఆందోళన' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డంపింగ్ యార్డు దుర్వాసన ఎంత భయంకరంగా ఉంటుందో కాంగ్రెస్ నేతలకు తెలిసేలా.. వారి ఇళ్ల ముందే చెత్త కుప్పలు, కుళ్లిపోయిన కుక్కలను వేస్తామని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.జాతీయ రహదారి పక్కన డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడం అంటే ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడటమేనని బండి సంజయ్ మండిపడ్డారు. యార్డు వల్ల కాలుష్యం పెరిగి రోగాలు వస్తాయని, దుర్వాసనతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఈ ప్రాంత కాలుష్యం కారణంగా ఇక్కడి యువతకు పిల్లను ఇచ్చేందుకు కూడా ఎవరూ ముందుకు రాని దుస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని మొదటగా వ్యతిరేకించింది తానేనని ఆయన గుర్తు చేశారు.నెల రోజులుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటాలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సంజయ్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా అధికారుల మాటలు పక్కనపెట్టి ప్రజల ఆర్తనాదాలను వినాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఈ అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లతో పాటు గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. డంపింగ్ యార్డు రద్దు చేయకపోతే కాంగ్రెస్ నేతలను హుజూరాబాద్ వీధుల్లో తిరగనివ్వమని, అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు.డంపింగ్ యార్డుపై బీజేపీ చిత్తశుద్ధితో పోరాడుతోందని, ఈ క్రమంలో లాఠీ దెబ్బలు తినడానికైనా, జైలుకు వెళ్లడానికైనా తాము సిద్ధమని సంజయ్ స్పష్టం చేశారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి

**అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు!**

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



తెలంగాణలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, సాగు ఆలస్యమైన మిగిలిన 13 జిల్లాల్లో కూడా తక్షణమే ప్రక్రియ మొదలుపెట్టాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరుగుతోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటికే 5,000 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 4.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, నిల్వ కోసం గోదాములను సిద్ధం చేయడంతో పాటు 20 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ నిల్వకు జిల్లాల వారీగా కేటాయింపులు పూర్తి చేశామని వెల్లడించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో 16 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ధాన్యం తేమను త్వరగా కొలిచేందుకు ప్యాడీ క్లీనర్లు, డ్రైయర్లను ఏర్పాటు చేశామని, తూకంలో పొరపాట్లు జరగకుండా పక్కాగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. మిల్లులకు ధాన్యం తరలింపులో జాప్యం జరగకుండా రవాణా ఏర్పాట్లను బలోపేతం చేశామని, తగినంత మంది హమాలీలను కూడా నియమించినట్లు ఆయన వివరించారు.పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం రాకుండా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద కఠిన నిఘా ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. రైతులకు ధాన్యం అమ్మిన వెంటనే ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా మార్కెటింగ్ శాఖ మరియు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతుల సంక్షేమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

**కార్మికుల భద్రతే మా ప్రాధాన్యం**

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం తవ్వకాల్లో కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సెక్రెటేరియట్ లో నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రూపొందించిన సమగ్ర భద్రతా నివేదికను మంత్రి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా సీస్మిక్ ఇమేజింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టొమోగ్రఫీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్ట్రెస్ జోన్లు, నీటి ఊటలపై అధ్యయనం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే 151.50 మీటర్ల తవ్వకం పూర్తయిందని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి యంత్రాంగాన్ని వినియోగించి రెండు వైపులా నెలకు 200 మీటర్ల మేర తవ్వకాలు జరపడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివరించారు. ఇదే క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణలోనూ ఎన్‌జీఆర్ఐ సాంకేతిక భాగస్వామ్యం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# అన్నదాతలు అధైర్యపడొద్దు ...అండగా నేనుంటా

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):




రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని, తాను అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు భరోసా ఇచ్చారు. సిద్దిపేట నియోజకవర్గంలో జరిగిన పంట నష్టంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ , వ్యవసాయ అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఆయన, క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించాలని, సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు.సిద్దిపేట అర్బన్ మండలంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న , మామిడి తోటలు భారీగా దెబ్బతిన్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇప్పటికే ఐదుసార్లు వడగండ్ల వానలు, ఒకసారి తుఫాన్ రావడంతో రైతులు కుదేలయ్యారని గుర్తు చేశారు. చేతికి వచ్చిన పంట నేలపాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.గతంలో ముగ్గురు మంత్రులు కలిసి సిద్దిపేట నియోజకవర్గంలోని ఇబ్రహీంనగర్ గ్రామంలో పంట నష్టాన్ని పరిశీలించినా, నేటికీ ఏ ఒక్క రైతుకు రూపాయి సాయం అందలేదని హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా, రైతులకు వెంటనే పంట నష్టపరిహారం చెల్లించాలని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను ఆదుకున్న తీరును గుర్తు చేస్తూ, ప్రస్తుత సర్కార్ నిర్లక్ష్యంపై మండిపడ్డారు.కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోయిందని, ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా ఆ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, మీ సమస్యల పరిష్కారం కోసం తాను పోరాడుతానని స్పష్టం చేశారు. బాధ్యులైన అధికారులు త్వరితగతిన అంచనాలు పూర్తి చేసి రైతులకు భరోసా కల్పించాలని హరీశ్ రావు సూచించారు.

# కొత్త డీజీపీగా సీవీ ఆనంద్?

- **డీజీపీ రేసులో ముందంజలో 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి..**
- **ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీ విరమణతో కీలక మార్పు**

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో అత్యున్నత పదవి అయిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (DGP) నియామకానికి రంగం సిద్ధమైంది. 1991 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ రాష్ట్ర నూతన డీజీపీగా పగ్గాలు చేపట్టడం దాదాపు ఖరారైనట్లు సచివాలయ వర్గాల సమాచారం. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, ఆయన స్థానంలో సమర్థుడైన అధికారి కోసం అన్వేషించిన ప్రభుత్వం సీవీ ఆనంద్ వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఏ క్షణమైనా వెలువడే అవకాశం ఉంది.సీవీ ఆనంద్ గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో శాంతిభద్రతల నిర్వహణలో తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా సాంకేతికతను వినియోగించుకోవడంలో, క్లిష్టమైన పరిస్థితులను చక్కదిద్దడంలో ఆయనకు ఉన్న అనుభవం ఇప్పుడు కలిసొచ్చింది. యూపీఎస్సీ పంపిన ముగ్గురు అధికారుల జాబితాలో ఆనంద్ పేరు ప్రథమ స్థానంలో ఉండటం, ముఖ్యమంత్రికి ఆయన పనితీరుపై ఉన్న నమ్మకం ఈ నియామకానికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనను ఆ పదవి నుంచి తప్పించి, శిఖా గోయల్‌ను నియమించడం ఈ మార్పుకు బలమైన సంకేతంగా నిలిచింది.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలీస్ శాఖలో చేపట్టిన భారీ ప్రక్షాళన, ఐపీఎస్ అధికారుల బదిలీల వెనుక కొత్త డీజీపీ రాకకు మార్గం సుగమం చేసే ఉద్దేశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన 'ఫ్యూచర్ సిటీ' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల భద్రత, రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ వ్యవస్థ ఆధునీకరణ వంటి అంశాల్లో సీవీ ఆనంద్ వంటి అనుభవజ్ఞుడైన అధికారి అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. డీజీపీగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తే శాంతిభద్రతల విభాగంలో మరిన్ని సంస్కరణలు వచ్చే అవకాశం ఉంది.ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీ విరమణ చేసే ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం లేదా మే 1వ తేదీ ఉదయం సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. తెలంగాణ పోలీస్ బాస్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఎదుట డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల అదుపు వంటి సవాళ్లు ఉన్నాయి. ఏది ఏమైనా, తన సుదీర్ఘ సర్వీసులో ఎన్నో కీలక బాధ్యతలు నిర్వహించిన సీవీ ఆనంద్ ఇప్పుడు రాష్ట్ర పోలీస్ యంత్రాంగానికి సారథ్యం వహించేందుకు సిద్ధమవుతున్నారు.

# ఆ శాఖకు ఆయన అనర్హుడు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):




రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను వాడుకుంటూ అరాచక పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ స్టేట్ జనరల్ సెక్రటరీ, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మన్నె క్రిషాంక్‌ను కూకట్‌పల్లి పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హోం శాఖ బాధ్యతలు చూసే అర్హత లేదని, రాష్ట్ర భద్రతకు సంబంధించిన రహస్యాలను ఆయన బయటపెడుతున్నారని ఆరోపించారు.ప్రభుత్వ అక్రమాలను ఆధారాలతో సహా బయటపెడుతున్న 'తెలుగు స్క్రైబ్' అనే సోషల్ మీడియా సంస్థను తట్టుకోలేక రేవంత్ సర్కార్ కుట్రలకు పాల్పడుతోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. అత్యంత ప్రమాదకరమైన టెర్రరిస్టులపై ప్రయోగించే యాంటీ టెర్రరిజం చట్టం కింద ఈ సంస్థపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. 99 శాతం మంది పోలీసులకు కూడా తెలియని 'సీఐ సెల్' అనే సంస్థ నుండి నోటీసులు ఇప్పించడం వెనుక ఉన్న మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు.ముఖ్యమంత్రి తన రాజకీయ కక్ష సాధింపుల కోసం ఐపీఎస్ అధికారుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మన్నె క్రిషాంక్, ఆయన భార్యపై కాంగ్రెస్ శ్రేణులు సోషల్ మీడియాలో దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని, కానీ అక్రమ కేసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం సోషల్ మీడియా సంస్థల మీద ఉగ్రవాద వ్యతిరేక చట్టాలను ప్రయోగించడం రేవంత్ రెడ్డి 'మతిభ్రమించిన' పాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎన్ని అరెస్టులు చేసినా బీఆర్ఎస్ భయపడదని, ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఏ విధంగా పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని, త్వరలోనే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధం

హైదరాబాద్(ఏడీఎన్ఎన్):



కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కేసీఆర్‌ను 'అల్లం' లాగా చూసిన జీవన్ రెడ్డి, బీఆర్ఎస్‌లో చేరగానే 'బెల్లం' లాగా పొగుడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు అత్యంత హాస్యాస్పదంగా ఉన్నాయని మండిపడ్డారు. సిరిసిల్లలో జీవన్ రెడ్డి చేసిన విమర్శలను పూర్తిగా ఖండిస్తున్నామని, ఆయన హైకోర్టు తీర్పును సరిగ్గా చదివి మాట్లాడాలని సూచించారు.గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ భారీగా దోపిడీ చేశారని ఆరోపించిన జీవన్ రెడ్డి, నేడు అదే కుటుంబానికి వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందని ఆది శ్రీనివాస్ విమర్శించారు. అనుమతులు లేకుండానే ప్రాజెక్టు పనులు ప్రారంభించి, వేల కోట్లు వృధా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ద్వారా ఇప్పటివరకు ఎన్ని టీఎంసీల నీరు ఇచ్చారో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారుల నివేదిక ప్రకారం ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, త్వరలోనే తుమ్మిడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్టు కడతామని, మేడిగడ్డకు మరమ్మతులు చేస్తామని స్పష్టం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీబీఐ విచారణకు ఆదేశిస్తుంటే.. కేటీఆర్, హరీష్ రావులకు వణుకు పుడుతోందని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. విచారణ నుంచి తప్పించుకోవడానికే వారు ఢిల్లీకి వెళ్లి బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణకు హైకోర్టు తీర్పు ఏమాత్రం అడ్డంకి కాదని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా విధ్వంసమైందని, దాన్ని గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీయే మళ్ళీ అధికారంలోకి వస్తుందని ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. గతంలో సన్నబియ్యం పథకం భేషుగ్గా ఉందని సీఎల్పీ సమావేశంలో మెచ్చుకున్న జీవన్ రెడ్డి, ఇప్పుడు మాట మార్చడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ , ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# చైనా తరహాలో ఇండస్ట్రియల్ పార్కులు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :




హైదరాబాద్ నగరం, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం హిల్ట్ పాలసీని తీసుకువచ్చిందని, దీనిని ప్రజాస్వామ్యబద్ధంగా అమలు చేయడమే తమ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. శుక్రవారం సెక్రటేరియట్ లో నిర్వహించిన రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఆయన పారిశ్రామికవేత్తలతో చర్చించారు. నగరంలో కాలుష్య స్థాయిలు పెరుగుతున్న నేపథ్యంలో, కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు.ఈ సందర్భంగా పారిశ్రామిక పార్కుల ప్రతినిధులు చైనా తరహాలో ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఔటర్ మరియు రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఈ పార్కులు ఏర్పాటు చేస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందని వారు తెలిపారు. ఈ సూచనలను స్వాగతించిన డిప్యూటీ సీఎం, హిల్ట్ పాలసీ గైడ్‌లైన్స్ రూపొందించే సమయంలో పరిశ్రమల ప్రతినిధుల ఆలోచనలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, కేవలం అభివృద్ధి కోసమే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.పరిశ్రమలు లాభసాటిగా నడవడంతో పాటు రాష్ట్రంలో కాలుష్యం ఉండకూడదన్నదే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొత్త ఇండస్ట్రియల్ పాలసీలో కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, వారి కోసం ప్రత్యేకంగా డార్మెటరీల ఏర్పాటును తప్పనిసరి చేశామని వెల్లడించారు. ఈ విధానంలో ప్రభుత్వం చాలా పారదర్శకంగా ఉందని, ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని ఇండస్ట్రియల్ అసోసియేషన్లతో చర్చించి పాలసీని వేగవంతం చేస్తామని తెలిపారు.మరోవైపు చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి హిల్ట్ పాలసీని స్వాగతిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వానికి చెందిన కొందరు నేతలు తమను భయపెట్టే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రభుత్వం జీవో ప్రకారం పారదర్శకంగా ముందుకు వెళ్తోందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పాలసీలో ఎక్కడా నగదు బదిలీ లేదని, కేవలం భూముల అభివృద్ధి మాత్రమే ఉందని పారిశ్రామికవేత్తల అపోహలను తొలగించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు , ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# సీఐ, ఎస్ఐపై వేటు

వికారాబాద్ (ఏడీఎన్ఎన్):

వికారాబాద్ జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌లో కలకలం రేపిన లంచం ఉదంతంపై పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. బాధితుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ, ఏసీబీ విచారణలో దోషులుగా తేలిన సీఐ బి. సరోజ, ఎస్ఐ హెచ్. రాణిలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మహిళలకు రక్షణగా నిలవాల్సిన పోలీస్ స్టేషన్, సెటిల్‌మెంట్లు , వసూళ్లకు అడ్డాగా మారిందనే ఆరోపణలు తాజా ఘటనతో నిజమని తేలాయి.అసలు ఏం జరిగిందంటే.. తాండూరుకు చెందిన ఓ దంపతుల మధ్య ఉన్న వివాదం విషయంలో నోటీసులు ఇచ్చేందుకు సీఐ సరోజ, ఎస్ఐ రాణి కలిసి రూ. 60,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడు అంత ఇచ్చుకోలేనని ప్రాధేయపడటంతో ఆ మొత్తాన్ని రూ. 40,000కు కుదించారు. మార్చి 23వ తేదీన పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోనే సీఐ సమక్షంలో ఎస్ఐ రాణి బాధితుడి నుంచి రూ. 20,000 నగదు తీసుకున్నారు. మిగిలిన డబ్బు కోసం వారు మళ్ళీ ఒత్తిడి చేయడంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.దీనిపై రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ప్రాథమిక విచారణ జరిపి, లంచం తీసుకున్నట్లు పక్కా ఆధారాలు సేకరించారు. సీఐ సరోజ, ఎస్ఐ రాణిలపై క్రిమినల్ మిస్‌కాండక్ట్ కేసులు నమోదు చేశారు. వీరిద్దరిపై కేవలం ఈ ఒక్క కేసే కాకుండా, గతంలోనూ 498A (గృహ హింస) కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు, కౌన్సెలింగ్ పేరుతో దంపతుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు ఉన్నట్లు సమాచారం. ఈ నివేదికల ఆధారంగానే వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.మహిళల సమస్యలను పరిష్కరించాల్సిన చోట ఇలాంటి అవినీతి జరగడంపై సామాన్య ప్రజలు , సామాజిక కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే భయపడకుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కి ఫిర్యాదు చేయాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు. ఈ సస్పెన్షన్ వేటు జిల్లా పోలీసు యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది.



# పంజాగుట్ట పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ప్రముఖ గాయని మంగ్లీకి సంబంధించిన కేసులో న్యాయవాది సుబ్బారావుకు బ్రీత్ ఎనలైజర్ టెస్టు చేసిన వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. శుక్రవారం జరిగిన విచారణలో పోలీసుల తీరుపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై పంజాగుట్ట సీఐ రామకృష్ణను నిలదీసింది. న్యాయవాదుల పట్ల పోలీసుల ప్రవర్తన సరిగా లేదని, స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరించడం సమంజసం కాదని కోర్టు అభిప్రాయపడింది. పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను ఎందుకు భద్రపరచలేదని, కోర్టుకు ఎందుకు అందజేయలేదని ప్రభుత్వ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. ఫుటేజ్ సమర్పించడానికి కొంత సమయం కావాలని ఏజీ కోరగా, న్యాయవాదికి బ్రీత్ టెస్టు చేసిన పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్‌పై ఇప్పటివరకు శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదని కోర్టు ఫైర్ అయింది. పోలీసులు, అడ్వకేట్లు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం హితవు పలికింది.మరోవైపు, ఈ కేసులో న్యాయవాది సుబ్బారావు తరఫు లాయర్ ఆసక్తికర విషయాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గాయని మంగ్లీ నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ సుబ్బారావు ఇప్పటికే తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసుల వేధింపులతో పాటు ప్రాణ భయం కూడా ఉందని, తగిన రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు, సెక్యూరిటీ అంశంపై వేసవి సెలవుల తర్వాత పూర్తిస్థాయి విచారణ చేపడతామని పేర్కొంది.ప్రజాస్వామ్యంలో న్యాయవాదుల హక్కులను కాలరాసేలా పోలీసులు ప్రవర్తించడంపై న్యాయవాద సంఘాలు కూడా మండిపడుతున్నాయి. పంజాగుట్ట పోలీసుల వివరణ మరియు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా తదుపరి విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. మొత్తానికి 'మంగ్లీ కేసు' అటు పోలీసులకు, ఇటు న్యాయవాదులకు మధ్య పెద్ద వివాదంగా మారింది.

మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
25.04.2026
www.manasarkar.com

## రాశి ఫలాలు

**25-04-2026 శనివారం**

**మేషం:**
ఉద్యోగంలో అధికారుల నుంచి ఆదరణ లభిస్తుంది. వృత్తి, వ్యాపారాలను లాభాల బాటలో నడిపిస్తారు. కొన్ని వ్యక్తిగత, కుటుంబ సమస్యల నుంచి క్రమంగా బయటపడతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. సోదరులతో, కొందరు బంధువులతో వివాదాలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. పని ఒత్తిడి బాగా తగ్గుతుంది.

**వృషభం:**
ఉద్యోగంలో హోదా పెరగడానికి అవకాశం ఉంది. వృత్తి, వ్యాపారాలు సానుకూలంగా సాగిపోతాయి. రావలసిన డబ్బు కొద్ది ప్రయత్నంతో చేతికి అందుతుంది. ఆదాయానికి లోటుండదు. దీర్ఘకాలిక అనారోగ్యం నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**మిథునం:**
వృత్తి, వ్యాపారాల్లో రాబడి బాగానే వృద్ధి చెందుతుంది. ఉద్యోగంలో బాధ్యతలు పెరిగే సూచనలున్నాయి. ఏ ప్రయత్నం తలపెట్టినా నెరవేరే అవకాశం ఉంది. వ్యయ ప్రయాసలున్నా ముఖ్యమైన వ్యవహారాలను పూర్తి చేస్తారు. ఇతరులకు మేలు జరిగే పనులు చేస్తారు. ఆరోగ్యానికి, ఆదాయానికి ఇబ్బందేమీ ఉండదు.

**కర్కాటకం:**
వృత్తి, ఉద్యోగాల్లో స్థిరత్వం లభిస్తుంది. జీతభత్యాలు పెరిగే అవకాశం ఉంది. వ్యాపారాలు ఆశాజనకంగా సాగిపోతాయి. ఆదాయానికి ఇబ్బందేమీ ఉండదు. ఖర్చులు బాగా పెరిగే అవకాశం ఉంది. పిల్లలు చదువుల్లో ప్రతిభను నిరూపించుకుంటారు. వాగ్దానాలకు ఇది సమయం కాదు.

**సింహం:**
ఉద్యోగులకు మంచి అవకాశాలు కలిసి వస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో అంచనాలకు మించి రాబడి ఉంటుంది. ముఖ్యమైన ప్రయత్నాలు, వ్యవహారాలు అనుకూల ఫలితాలనిస్తాయి. నిరుద్యోగులకు సమయం అనుకూలంగా ఉంది. వ్యాపారాల్లో పెట్టుబడులు పెంచే అవకాశం ఉంది.

**కన్య:**
ఉద్యోగంలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. కొత్త లక్ష్యాలు, బాధ్యతల్ని చేపడతారు. కొందరు బంధుమిత్రుల నుంచి రావాల్సిన డబ్బు చేతికి అందుతుంది. కుటుంబ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో శ్రమ పెరిగినా ఫలితం ఉంటుంది. ఆరోగ్యానికి ఢోకా ఉండదు.

**తుల:**
వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా పురోగమిస్తాయి. ఉద్యోగంలో అధికారులు మీ మీద ఎక్కువగా ఆధారపడతారు. ఆర్థిక పరిస్థితి చాలావరకు మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక ఆర్థిక సమస్యల నుంచి బయటపడే అవకాశం ఉంది. ఆదాయ వృద్ధికి ఎటువంటి ప్రయత్నం తలపెట్టినా సఫలం అవుతుంది.

**వృశ్చికం:**
వృత్తి, వ్యాపా రాలు నిదానంగా సాగుతాయి. నిరుద్యోగులకు ఆశించిన సమాచారం అందుతుంది. కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లి విరుస్తాయి. ఇంటా బయటా బాగా ఒత్తిడి ఉన్నప్పటికీ ముఖ్యమైన వ్యవహారాల్ని పూర్తి చేస్తారు. ఆస్తి వివాదాలు చాలావరకు పరిష్కారం అవుతాయి.

**ధనస్సు:**
వృత్తి, ఉద్యోగాల్లో హోదా పెరిగే అవకాశం ఉంది. వ్యాపారాలు లాభాల బాటపడతాయి. మొత్తం మీద గ్రహ సంచారం బాగా అనుకూలంగా ఉంది. సోదరులతో ఆస్తి వివాదం ఒకటి పరిష్కారం అవుతుంది. సామాజికంగా పలుకుబడి పెరుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో ఆశించిన విధంగా స్థిరత్వం లభిస్తుంది.

**మకరం:**
వృత్తి, ఉద్యోగాల్లో బరువు బాధ్యతలు పెరుగుతాయి. వ్యక్తిగతంగా సమస్యలు పరిష్కారం అవుతాయి. పిల్లల నుంచి శుభవార్తలు వింటారు. కొందరు బంధువులకు, సన్నిహితు లకు ఆర్థికంగా సహాయపడతారు. వ్యాపారాలు నిలకడగా సాగిపోతాయి. ఎవరికీ వాగ్దానాలు చేయవద్దు.

**కుంభం:**
వృత్తి, ఉద్యోగాలు ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగిపోతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆస్తి, ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టడం మీద దృష్టి కేంద్రీకరిస్తారు. మీ సలహాలు, సూచనలకు అధికారులు విలువనిస్తారు. ఆర్థిక పరిస్థితి చాలావరకు ఆశాజనకంగా ఉంటుంది.

**మీనం:**
వృత్తి, ఉద్యోగాల్లో అధికారులను మీ పనితీరుతో ఆకట్టుకుంటారు. వ్యాపారాలు సజావుగా సాగిపోతాయి. ఎక్కువగా ఆధ్యాత్మిక చింతనలో, దైవ కార్యాల్లో గడుపుతారు. ఆస్తి వివాదం పరిష్కారం అవుతుంది. తొందరపడి నిర్ణయాలు తీసుకుని ఇబ్బంది పడతారు.




## అర్ధరాత్రి ఘటన.. యువతిని కాపాడిన పోలీసులు

**మంగళగిరి: (ఏడీఎన్ఎన్):**

అర్ధరాత్రి వేళ ఓ యువతిపై జరగాల్సిన ఘోరాన్ని ఆమె సమయస్ఫూర్తి, పోలీసుల వేగవంతమైన స్పందన అడ్డుకున్న ఘటన మంగళగిరి పరిధిలో చోటుచేసుకుంది. 'శక్తి' యాప్ ద్వారా పంపిన అలర్ట్‌తో పోలీసులు స్పందించి, ఆటో డ్రైవర్ చెరలో చిక్కుకున్న యువతిని సురక్షితంగా రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరు నుంచి అర్ధరాత్రి సమయంలో విజయవాడ బస్టాండ్‌కు చేరుకున్న యువతిని ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి తన ఆటోలో ఎక్కించుకున్నాడు. ప్రయాణమధ్యంలో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అతడు, మంగళగిరి దాటి చినకాకాని సమీపంలో ఆమెపై అఘాయిత్యానికి యత్నించాడు. ఈ సమయంలో అప్రమత్తమైన యువతి తన మొబైల్‌లోని 'శక్తి' యాప్ ద్వారా పోలీసులకు సమాచారాన్ని అందించింది. వెంటనే స్పందించిన మంగళగిరి గ్రామీణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా, ఎస్.ఐ. వెంకట్ వెంటాడి పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, బాధిత యువతిని సురక్షితంగా ఆమె స్వస్థలానికి చేర్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ఆర్టీసీ డ్రైవర్ మృతిపై విపక్షాల గర్జన!

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**


ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యపై రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ఈ విషాద ఘటనకు నిరసనగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీల శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగగా, ఆయా పార్టీల అగ్రనేతలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ 'ప్రభుత్వ హత్యే'నని విపక్షాలు ఏకగ్రీవంగా అభివర్ణించాయి.

**ఇది రేవంత్ ప్రభుత్వ హత్య.. రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: కేటీఆర్**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ప్రభుత్వ హత్య'గా అభివర్ణించారు. మృతదేహాన్ని కనీసం నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ఒకే రోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్యాయత్నం చేయడం తెలంగాణ చరిత్రలోనే 'చీకటి రోజు' అని ఆవేదన వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని, ఇతర కార్మిక నేతలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడి ప్రాణాలు తీసుకోవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వ మెడలు వంచి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు.

**శంకర్‌గౌడ్ మృతికి రేవంత్‌రెడ్డిదే బాధ్యత.. ఆ రోజే 'అప్పాయింటెడ్ డే': హరీశ్‌రావు**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మబలిదానం తమ హృదయాలను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరణానికి ముమ్మాటికీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యమే కారణమని ఆయన 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని, అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ఇంకెంత మందిని బలి తీసుకుంటారని రేవంత్ సర్కారును నిలదీశారు. శంకర్‌గౌడ్ అమరుడైన రోజునే 'అప్పాయింటెడ్ డే'గా ప్రకటించి, ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎవరూ అధైర్యపడి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, కలిసికట్టుగా పోరాడి హక్కులు సాధించుకుందామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.




**'అభయహస్తం' హామీలు ఏమయ్యాయి?: బండి సంజయ్**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తూ కార్మికులను మభ్యపెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ తన 'అభయహస్తం' మేనిఫెస్టోలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, పీఆర్సీ బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కార్మికులను పట్టించుకోలేదని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోందని ధ్వజమెత్తారు. కార్మికులు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ధైర్యంగా ఉండి పోరాడాలని, బీజేపీ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని హామీ ఇచ్చారు.

**ఆర్టీసీ సమ్మెను అణిచివేసే కుట్ర సాగుతోంది: డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

ప్రభుత్వమే ఆర్టీసీ సమ్మెను అణిచివేసే కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శంకర్ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్ హౌస్ సదుపాయం కూడా ఇవ్వకూడదని తాండూరు పోలీసులు ఇచ్చిన నోటీసులు అత్యంత భయానకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తులో ఆర్టీసీ కార్మికుల వార్తలు రాస్తున్న విలేకరులపై కూడా కేసులు నమోదు చేసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు.

**కేసీఆర్ తెచ్చిన జీఓను వెంటనే అమలు చేయాలి: పాడి కౌశిక్ రెడ్డి**

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ తెచ్చిన చారిత్రాత్మక జీఓను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దీనివల్ల కార్మికుల్లో అభద్రతా భావం పెరిగిందని, నిధుల కొరత సాకుతో సంస్థను కునారిల్లేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఏటా రూ. 1500 కోట్లు కేటాయించి సంస్థను బలోపేతం చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే మొండి వైఖరిని వీడి, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ బలిదానాలకు కారణం: పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి**

శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి శంకర్ గౌడ్ మరణంపై విచారం వ్యక్తం చేస్తూ, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు అలవికాని హామీలు ఇచ్చి ఇప్పుడు ఆర్టీసీ కార్మికులను, తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయమంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. ఇంకా ఎంత మందిని బలి తీసుకుంటారని ప్రశ్నిస్తూ, శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ సమ్మెతో కేయూ పరీక్షలు వాయిదా

**హనుమకొండ(ఏడీఎన్ఎన్):**

ఆర్టీసీ సమ్మె ప్రభావం విద్యార్థులపై పడుతోంది. ముఖ్యంగా రవాణా సౌకర్యాలు నిలిచిపోవడంతో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాకతీయ యూనివర్శిటీ కీలక నిర్ణయం తీసుకుంది. హనుమకొండలోని కాకతీయ యూనివర్శిటీ పరిధిలో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆర్టీసీ సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా బస్సు సర్వీసులు పూర్తిగా లేదా 50 శాతం పైగా నిలిచిపోవడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం కష్టమవుతోందని వారు పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో




ఉంచుకుని శుక్రవారం, శనివారం నిర్వహించాల్సిన అన్ని పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. యూనివర్శిటీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ నిర్ణయం పూర్తిగా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఎక్కువగా ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నందున, రవాణా లోపం వారికి పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. ఇక వాయిదా పడిన పరీక్షలకు సంబంధించి కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని యూనివర్శిటీ స్పష్టం చేసింది. అధికారిక వెబ్‌సైట్, నోటీసుల ద్వారా విద్యార్థులకు సమాచారం అందజేస్తామని వెల్లడించింది. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి, యూనివర్శిటీ నుంచి వచ్చే తాజా ప్రకటనలను గమనించాలని సూచించారు. ఆర్టీసీ సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని మరికొన్ని విద్యాసంస్థలు కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో విద్యార్థులు తమ ప్రయాణ ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికలు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఆర్టీసీ సమ్మె 3వ రోజు.. నిర్మల్‌లో ఆందోళన

**నిర్మల్: (ఏడీఎన్ఎన్):**

ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం కొనసాగుతున్న సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్మల్ డిపో కార్యాలయం ఎదుట కార్మికులు, ఉద్యోగులు ధర్నా నిర్వహించి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. సమ్మెకు మద్దతుగా కార్మికులు నోటికి నల్ల వస్త్రాలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్మికుల హక్కుల కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన శంకర్ గౌడ్‌కు నివాళులు అర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కార్మిక నాయకులు, తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం కనీస స్పందన చూపలేదని విమర్శించారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని, లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నిర్మల్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# బీజేపీ ఆఫీసులో మల్లారెడ్డి కోడలు..

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**

మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయాన్ని సందర్శించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రెండు రోజుల క్రితమే ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును కూడా కలిశారు. వచ్చే నెలలో తమ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సుమారు లక్ష మందితో నిర్వహించనున్న 'వందేమాతరం' ఆలాపన కార్యక్రమం గురించి చర్చించేందుకే ఆమె వచ్చారని తెలుస్తోంది. ఇటీవలే మల్లారెడ్డి కుటుంబం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా కలవడంతో, ప్రీతిరెడ్డి వరుస భేటీలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. గత కొద్దిరోజులుగా మల్లారెడ్డి కుటుంబం బీజేపీ అగ్రనేతలతో టచ్‌లో ఉండటం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విద్యాసంస్థల కార్యక్రమం అని చెబుతున్నప్పటికీ, వరుసగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి రావడం, కీలక నేతలతో సమావేశం అవ్వడం వెనుక పార్టీ మార్పు సంకేతాలు ఉన్నాయా అనే చర్చ మొదలైంది. ముఖ్యంగా ప్రధాని మోదీని కలిసిన కొద్ది




రోజుల్లోనే ఈ భేటీలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**అది రాజకీయ భేటీ కాదు!**

ఈ భేటీపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలవ్వడంతో ఆమె స్పందిస్తూ.. తాను బీజేపీలో చేరడం లేదని, ఈ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టం చేశారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో 'ఏఐ క్యాంపస్' ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించామని, డిజిటల్ ఇండియా కోసమే తాను అన్ని పార్టీల నేతలను కలుస్తున్నట్లు ఆమె వివరించారు.

## ములుగులో మావోయిస్టు సభ్యురాలి సరెండర్

**ములుగు(ఏడీఎన్ఎన్):**

అజ్ఞాతంలో కొనసాగుతున్న నక్సల్స్ ప్రభుత్వానికి లొంగిపోయి సాధారణ జీవనంలో కలవాలని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ఎలాంటి ప్రాణహాని ఉండదని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో మావోయిస్టు కమాండర్ విజ్జాలు అలియాస్ ఐతూ, మావోయిస్టు పార్టీ సభ్యురాలు మీడియం రామే అలియాస్ రజిత (సౌత్ బస్టర్ డివిజనల్ కమిటీ 9వ ప్లాటూన్ సభ్యురాలు) లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "పోరు కన్నా ఊరు మిన్న.. మన ఊరికి తిరిగి రండి" అవగాహన కార్యక్రమం ఫలితంగా పలువురు నక్సల్స్ లొంగిపోతున్నారని తెలిపారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ తరపున పునరావాస సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. ఇప్పటికైనా అజ్ఞాతంలో ఉన్న నక్సల్స్ లొంగిపోయి కుటుంబ సభ్యులతో కలిసి సాధారణ జీవితం గడపాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





## ఆర్టీసీ సమ్మెకు జనసేన సపోర్ట్

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్):**

తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం కొనసాగిస్తున్న సమ్మెకు జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కార్మికులు ప్రాణత్యాగాలకు పాల్పడకుండా ధైర్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ మేరకు నటుడు, జనసేన నాయకుడు ఆర్.కె. సాగర్ విడుదల చేసిన వీడియోలో సమ్మెకు మద్దతు ప్రకటించారు. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మృతి దురదృష్టకరమని, ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేకమంది యువకులు, విద్యార్థులు బలిదానాలు చేసినప్పటికీ, ఆ తరువాత వారిని పెద్దగా గుర్తించలేదని ఆయన గుర్తుచేశారు. కాబట్టి ప్రాణాలు కోల్పోవడం సమస్యలకు పరిష్కారం కాదని, కార్మికులు ధైర్యంగా పోరాటం కొనసాగించాలని సూచించారు. సుమారు 38 వేల మంది ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు జనసేన పార్టీ ఈ రోజు నుంచి పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.




## హెచ్‌సీఏ అవకతవకలపై సిట్ దర్యాప్తు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**


హైదరాబాద్ క్రికెట్ సంఘం లో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలు, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీసీఐడీలోని సిట్ ఈ దర్యాప్తును చేపట్టాలని, మొత్తం ప్రక్రియను అపెక్స్ కౌన్సిల్ జస్టిస్ నవీన్‌రావు పర్యవేక్షించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నగేశ్ భీమపాక.. హెచ్‌సీఏకు స్వయం ప్రతిపత్తి ఉన్నప్పటికీ, అవినీతి, అక్రమాలు జరిగినప్పుడు న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని, పారదర్శకత కోసం జోక్యం చేసుకుంటాయని వెల్లడించారు. ఈ దర్యాప్తునకు హెచ్‌సీఏ అధికారులు, సిబ్బంది అందరూ పూర్తిగా సహకరించాలని కోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసింది.



## భారీ రద్దీ.. సర్వదర్శనానికి ఆలస్యం

**తిరుమల(ఏడీఎన్ఎన్):**

శ్రీవారి దర్శనానికి తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. దర్శనం కోసం వేచి ఉండే కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోవడంతో క్యూలైన్ శిలాతోరణం వరకు పొడిగించారు. టోకెన్లు లేని సాధారణ భక్తులకు సర్వదర్శనానికి సుమారు 24 గంటల సమయం పడుతోంది. టీటీడీ వర్గాల ప్రకారం, శుక్రవారం శ్రీవారిని 59,602 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 29,280 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల నుంచి అందిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ.3.46 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## వివాహేతర సంబంధం బయటపడటంతో ఘర్షణ

**వైఎస్సార్ జిల్లా(ఏడీఎన్ఎన్):**

వివాహేతర సంబంధం కారణంగా భర్తను హత్య చేయాలని భార్య పన్నిన కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ప్రొద్దుటూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి (వ్యవసాయదారు)కు 15 ఏళ్ల క్రితం శిల్పారెడ్డితో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. ఇటీవల దంపతుల మధ్య విభేదాలు తలెత్తగా, ఐదు నెలల క్రితం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న సుధీర్‌తో శిల్పారెడ్డికి పరిచయం ఏర్పడి, అది తరువాత వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం భర్తకు తెలిసిన తరువాత కుటుంబంలో కలహాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. దీంతో శిల్పారెడ్డి తన ప్రియుడు సుధీర్‌తో కలిసి భర్తను హత్య చేయాలని కుట్ర పన్నింది. ఇందుకోసం రాజుపాళెం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ నవీన్ ద్వారా హిందూపురానికి చెందిన కిరాయి ముఠాను సంప్రదించింది. ఈశ్వర్‌రెడ్డిని హత్య చేయడానికి రూ.10 లక్షల సుపారీ కుదుర్చుకుని, ముందుగా రూ.5 లక్షలు చెల్లించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో హిందూపురానికి చెందిన కిరాయి గ్యాంగ్ బుధవారం ప్రొద్దుటూరుకు చేరుకుని, బైపాస్ రోడ్డులో ఈశ్వర్‌రెడ్డిని కారుతో ఢీకొట్టి హత్య చేయడానికి ప్రయత్నించారు. అయితే అప్రమత్తమైన ఈశ్వర్‌రెడ్డి తప్పించుకుని వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. భార్య శిల్పారెడ్డి, ప్రియుడు సుధీర్, రౌడీషీటర్ వినయ్‌తో పాటు హిందూపురం కిరాయి ముఠాకు చెందిన పలువురితో సహా మొత్తం 10 మందిని అరెస్ట్ చేసినట్లు ప్రొద్దుటూరు ఏఎస్పీ విబూకృష్ణ వెల్లడించారు.



## ముకేశ్‌కే ఈ విజయం అంకితం: రుతురాజ్ గైక్వాడ్


**దుఃఖాన్ని దిగమింగి.. జట్టు కోసం తిరిగొచ్చిన ముకేశ్!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (CSK) విశ్వరూపం ప్రదర్శించింది. వాంఖడే స్టేడియం వేదికగా చిరకాల ప్రత్యర్థి ముంబయి ఇండియన్స్ ను 103 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి, లీగ్ చరిత్రలోనే తన అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. అయితే, ఈ గెలుపు కేవలం పాయింట్ల పట్టిక కోసమే కాదు.. తమ సహచర ఆటగాడు ముకేశ్ చౌదరి పట్ల జట్టుకున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ చేసిన వ్యాఖ్యలు అందరినీ కదిలించాయి. ఈ చారిత్రాత్మక విజయాన్ని పేసర్ ముకేశ్ చౌదరికి అంకితం ఇస్తున్నట్లు ప్రకటించాడు. "ముకేశ్ తన తల్లిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నాడు. అంత్యక్రియలు ముగిసిన వెంటనే జట్టు కోసం తిరిగి రావడం అతడి మానసిక ధైర్యానికి నిదర్శనం. అతడి కోసమే ఈ మ్యాచ్ గెలవాలని మేం ముందే నిర్ణయించుకున్నాం." అని పేర్కొన్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై, సంజు శాంసన్ అద్భుత శతకంతో భారీ స్కోరు సాధించింది. పిచ్ పరిస్థితులను అంచనా వేస్తూ సీఎస్కే మెరుగైన స్కోర్ సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో ముంబయిని బౌలర్లు కట్టడి చేశారు. ముకేశ్ చౌదరి పవర్ ప్లేలో క్వింటన్ డికాక్ వంటి కీలక వికెట్ తీసి ముంబయిని దెబ్బతీశాడు. అకీల్ హొస్సేన్, నూర్ అహ్మద్ జంట స్పిన్ మ్యాజిక్‌తో ముంబయి మిడిలార్డర్ ను కోలుకోలేని విధంగా కుదేలు చేసింది. ముంబయి వంటి బలమైన జట్టును వారి సొంత గడ్డపైనే ఇంత భారీ తేడాతో ఓడించడం, సీఎస్కే తిరిగి ఫామ్‌లోకి వచ్చిందని చెప్పడానికి బలమైన సంకేతం. ముఖ్యంగా కష్టసమయంలో తోటి ఆటగాడికి అండగా నిలిచిన తీరు ఈ విజయానికి మరింత వన్నె తెచ్చింది.

## హాకీలో చరిత్ర సృష్టించిన కూలీ బిడ్డ నౌషీన్ నాజ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ఆట పట్ల అంకితభావం ఉంటే పేదరికం పరుగును అడ్డుకోలేదని 15 ఏళ్ల నౌషీన్ నాజ్ నిరూపిస్తోంది. ఖరీదైన కిట్లు, బ్రాండెడ్ షూస్ లేకపోయినా, అరువు తెచ్చుకున్న హాకీ స్టిక్‌తోనే అద్భుతాలు చేస్తూ భారత మహిళల హాకీ భవిష్యత్ ఆశాకిరణంగా అవతరించింది. మధ్యప్రదేశ్‌లోని సియోనికి చెందిన నౌషీన్ నేపథ్యం అత్యంత సామాన్యం. రోజుకు రూ. 250 సంపాదించే దినసరి కూలీ బిడ్డ ఆమె. నాలుగేళ్ల క్రితం ఒక పాత, విరిగిన హాకీ స్టిక్‌తో ఆమె ప్రస్థానం మొదలైంది. అది విరిగినప్పుడల్లా దానికి గుడ్డ చుట్టి మరీ ఆమె ప్రాక్టీస్ చేసేది. కనీసం పైకప్పు సరిగ్గా లేని అద్దె ఇంట్లో నివసిస్తున్నప్పటికీ, మైదానంలో మాత్రం నౌషీన్ ఒక ఛాంపియన్ లా దూసుకుపోతోంది. బిహార్ లోని రాజ్ గిర్ లో జరిగిన సబ్ జూనియర్ జాతీయ ఛాంపియన్ షిప్ లో నౌషీన్ సత్తా చాటింది. కేవలం ఒక టోర్నీలోనే 9 గోల్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలవడమే కాకుండా, ఫైనల్ లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. "ఆడపిల్లవు నీకెందుకు హాకీ?" అని విమర్శించిన వారికి నౌషీన్ తండ్రి అఫ్ఫాజ్ ఖాన్ గట్టి సమాధానం ఇచ్చారు. తన ఏడుగురు సంతానంలో ఒకరైన నౌషీన్ ను ప్రోత్సహిస్తూ, ఆమె లక్ష్యం కోసం కొండంత అండగా నిలుస్తున్నారు. తండ్రి ప్రోత్సాహంతోనే ఇప్పుడు ఆమె చెల్లెలు సబారికా కూడా హాకీ వైపు అడుగులు వేస్తోంది. ప్రస్తుతం జపాన్ లో జరగనున్న అండర్ 18 ఆసియా కప్ జట్టులో చోటు సంపాదించడమే నౌషీన్ ముందున్న తక్షణ లక్ష్యం. మధ్యప్రదేశ్ హాకీ అకాడమీ అందిస్తున్న తోడ్పాటుతో, త్వరలోనే టీమ్ ఇండియా జెర్సీ ధరించి దేశం కోసం ఆడాలని ఆమె కలలు కంటోంది. "పరిస్థితులు మనకు అనుకూలంగా లేనప్పుడు, మనమే పరిస్థితులకు అనుగుణంగా మారి పోరాడాలి" అనే మాటకు నౌషీన్ నాజ్ ఒక నిలువెత్తు నిదర్శనం.



## ఆ నంబర్లతో కాల్ వస్తే ప్రమాదమే!

**కాల్ సెంటర్ల రూపంలో డిజిటల్ దోపిడీ!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సాంకేతికత ఎంత వేగంగా పెరుగుతుందో, అంతే వేగంగా సైబర్ నేరగాళ్లు సామాన్యులను దోచుకునే కొత్త దారులను వెతుకుతున్నారు. తాజాగా ఆర్‌బీఐ (RBI), ట్రాయ్ (TRAI) అధికారులమంటూ ఫోన్ కాల్స్ చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేసి సొమ్ము దోచుకుంటున్న ముఠాల పట్ల పోలీసులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ప్రధానంగా +97, +85 కోడ్ లతో ప్రారంభమయ్యే ఇంటర్నేషనల్ నంబర్ల నుండి వచ్చే కాల్స్ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ కోడ్లతో కాల్స్ వస్తే అవి మోసపూరితమైనవిగా భావించి, అస్సలు లిఫ్ట్ చేయకూడదని హెచ్చరించారు. ఒకవేళ తెలియక ఫోన్ ఎత్తి ఆర్థికంగా మోసపోయినట్లు గుర్తిస్తే, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సైబర్ సెక్యూరిటీ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలి. మన దేశంలో మొబైల్ వినియోగదారుల్లో సుమారు 95 శాతం మంది ప్రతిరోజూ స్పామ్ కాల్స్ లేదా సందేశాలతో విసిగిపోతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2024 సెప్టెంబర్ నుండి 2026 జనవరి మధ్య కాలంలో ఏకంగా 7,100 కోట్ల స్పామ్ కాల్స్, 290 కోట్ల సందేశాలను గుర్తించినట్లు ఎయిర్‌టెల్ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల వల్ల సుమారు రూ. 92.7 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కేవలం వ్యక్తులుగా కాకుండా, ఆధునిక సాంకేతికతతో కూడిన కాల్ సెంటర్లను నడుపుతూ వ్యవస్థీకృతంగా మోసాలకు పాల్పడుతున్నారు. లక్షలాది మోసపూరిత లింక్‌లను కంపెనీలు బ్లాక్ చేస్తున్నప్పటికీ, కొత్త దారుల్లో దాడులు జరుగుతూనే ఉన్నాయి.

# సొంతగడ్డపై విజయగర్జన!



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. చిన్నస్వామి స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్ తో శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. గుజరాత్ నిర్దేశించిన 206 పరుగుల భారీ లక్ష్యాన్ని విరాట్ కోహ్లీ (81), దేవదత్ పడిక్కల్ (55) అద్భుత ఇన్నింగ్స్ లతో మరో 7 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్‌తో కలిసి కోహ్లీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు కేవలం 59 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. ముఖ్యంగా పడిక్కల్ కేవలం 27 బంతుల్లో 2 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో విరుచుకుపడగా, కోహ్లీ 44 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో క్లాస్ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటవ్వడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. ఈ దశలో కృనాల్ పాండ్యా (23*), టిమ్ డేవిడ్ (10*) సంయమనంతో ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్, ఓపెనర్ సాయి సుదర్శన్ (58 బంతుల్లో 100) అద్భుత సెంచరీతో 20 ఓవర్లలో 3 వికెట్లకు 205 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (32) కూడా రాణించాడు. అయినప్పటికీ, కోహ్లీ, పడిక్కల్ మెరుపుల ముందు సుదర్శన్ శతకం వృథా అయింది.

## ప్రాక్టీస్‌లో యువ బ్యాటర్‌కు గాయం!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా ఢిల్లీ క్యాపిటల్స్ యువ బ్యాటర్ సాహిల్ పారఖ్ తీవ్రంగా గాయపడ్డారు. నెట్స్ లో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఒక బౌన్సర్ నేరుగా అతని ముఖానికి తగలడంతో సాహిల్ అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. 18 ఏళ్ల ఈ యువ ఆటగాడి ముఖం నుంచి రక్తం రావడంతో పాటు తీవ్ర అస్వస్థతకు గురవడంతో స్టేడియంలోని మెడికల్ సిబ్బంది వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స అందించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అతడిని అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. సాహిల్ పరిస్థితిపై ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం నుంచి ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన



వెలువడలేదు. ప్రస్తుతం ఐపీఎల్ పాయింట్ల పట్టికలో ఢిల్లీ క్యాపిటల్స్ ఆరో స్థానంలో ఉంది. ఈ సీజన్‌లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు మిశ్రమ ఫలితాలతో కొనసాగుతోంది. చెన్నై సూపర్ కింగ్స్ పై ఘనవిజయం సాధించినప్పటికీ, గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి పాలైంది. ఓపెనర్ పాతుమ్ నిస్సంక శుభారంభం ఇస్తున్నా, మిడిల్ ఆర్డర్ వైఫల్యం జట్టును వేధిస్తోంది. టోర్నమెంట్ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో జట్టులో నిలకడ అవసరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంగ్లాండ్ ప్లేయర్ బెన్ డకెట్ రెడ్‌బాల్ క్రికెట్ పై దృష్టి సారించేందుకు ఐపీఎల్ నుంచి తప్పుకోవడంతో, అతని స్థానంలో యువ లెగ్ స్పిన్నర్ రెహాన్ అహ్మద్‌ను ఢిల్లీ జట్టులోకి తీసుకుంది. ఫిట్నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న కెప్టెన్ అక్షర్ పటేల్‌కు బ్యాకప్‌గా రెహాన్ సేవలను వినియోగించుకుంటారా లేదా నేరుగా ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకుంటారా అనేది వేచి చూడాలి. రేపు (ఏప్రిల్ 25) పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్ తో ఢిల్లీ తలపడనుంది.

## ఫిఫా ఫైనల్ టికెట్.. రూ. 21 కోట్లు!

**ఫుట్ బాల్ క్రేజ్ అంటే ఇదే!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ఫుట్ బాల్ అభిమానులు ఆరాధ్య దైవంగా భావించే ఫిఫా వరల్డ్ కప్ కు రంగం సిద్ధమైంది. యూఎస్ఏ, కెనడా, మెక్సికోలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీ కోసం టికెట్ల వేట మొదలైంది. అయితే, ఫైనల్ మ్యాచ్ కోసం ఫిఫా ప్రకటించిన కొన్ని ప్రత్యేక టికెట్ల ధరలు వింటే సామాన్యులే కాదు, సెలబ్రిటీలు కూడా షాక్ అవ్వాల్సిందే! న్యూజెర్సీ వేదికగా జులై 19న జరిగే ఫైనల్ మ్యాచ్ కోసం ఫిఫా తన రీసేల్ సైట్‌లో నాలుగు ప్రత్యేక సీట్లను అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో టికెట్ ధర ఏకంగా 2.3 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 21 కోట్లు) గా నిర్ణయించింది. ఇవి గోల్ పోస్ట్ వెనుక భాగంలోని లోయర్ డెక్ లో ఉన్నాయి. 33 నుండి 36 వరకు ఉన్న ఈ నెంబర్ల సీట్ల నుంచి మ్యాచ్‌ను అత్యంత దగ్గరగా చూసే వీలుంటుంది. టాప్ కేటగిరీలోని ఇతర టికెట్ల ధరలు కూడా భారీగా




పెరిగాయి, ఒక్కోటి సుమారు రూ. 10.19 లక్షలు పలుకుతున్నాయి. ఈ టోర్నీ కోసం ఇప్పటివరకు ఏకంగా 50 కోట్లకు పైగా టికెట్ అభ్యర్థనలు వచ్చాయని ఫిఫా వెల్లడించింది. ఈ ఆదాయాన్ని తన 211 సభ్య దేశాల్లో క్రీడాభివృద్ధికి పెట్టుబడిగా పెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది. జూన్ 11 నుండి జులై 19 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. గతంలో 32 జట్లు ఉండేవి. ఈ ఏడాది మొదటిసారిగా 48 దేశాలు పోటీపడుతున్నాయి. జట్ల సంఖ్య పెరగడంతో పాటు ఈ పోటీలు అమెరికాలో జరగనుండటంతో ఈసారి ఫిఫా చరిత్రలోనే అత్యంత ఖరీదైన టోర్నీగా నిలవనుంది. కేవలం టికెట్ల రూపంలోనే ఫిఫా రికార్డు స్థాయి ఆదాయాన్ని ఆశిస్తోంది.

## గోల్డ్ ప్రియులకు గుడ్‌న్యూస్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

గత కొంతకాలంగా సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్న పసిడి ధరలు ఎట్టకేలకు దిగివచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలకు అంతర్జాతీయ పరిణామాల వల్ల వరుసగా రెండో రోజు 'సడెన్ బ్రేక్' పడింది. కొనుగోలుదారులకు ఇది స్వల్ప ఊరటనిచ్చే అంశం. దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధరపై సుమారు రూ. 600 వరకు తగ్గగా, వెండి ధర కూడా నామమాత్రంగా తగ్గింది. శుక్రవారం 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం రూ. 600 తగ్గి, రూ. 1,52,950 వద్ద ఊగిసలాడుతోంది. 22 క్యారెట్లు 10 గ్రాముల బంగారం రూ. 550 తగ్గి, రూ.



1,40,200 వద్ద ఉంది. వరుసగా 3 రోజులుగా తగ్గుతూ రావడంతో బంగారం ప్రియులు పండుగ చేసుకుంటున్నారు. బంగారం బాటలోనే వెండి కూడా పయనిస్తోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ. 2,59,900 వద్ద కొనసాగుతుండగా, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో రూ. 2,65,000 వద్ద ట్రేడవుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్‌లో లాభాల స్వీకరణ జరగడం వల్ల ధరలు కొంత తగ్గుముఖం పట్టాయి. ఒకానొక దశలో బంగారం ధర రూ. 2 లక్షలకు, వెండి రూ. 4 లక్షల మార్కుకు చేరువవడంతో మార్కెట్‌లో డిమాండ్ స్వల్పంగా తగ్గి ధరలు స్థిరపడే దిశగా అడుగులు వేస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ధరల్లో ఈ స్వల్ప తగ్గుదల కొనుగోలుదారులకు మేలు చేకూర్చే అవకాశం ఉంది. అయితే, అంతర్జాతీయ ఉద్రిక్తతలు పూర్తిగా సద్దుమణిగితే తప్ప ధరలు మరింత దిగివచ్చే అవకాశం లేదని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## AI మంత్రం.. ఉద్యోగులకు గండం!

**పెట్టుబడుల వేటలో..**
**మానవ వనరుల కోత**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టెక్ ప్రపంచం ఇప్పుడు ఒక వింతైన సందిగ్ధంలో ఉంది. ఒకవైపు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (AI) మానవాళిని అద్భుతమైన భవిష్యత్తు వైపు తీసుకెళ్తుందని ఆశలు కల్పిస్తుంటే, మరోవైపు అదే టెక్నాలజీ వేలాది మంది జీవనాధారమైన ఉద్యోగాలను మింగేస్తోంది. తాజాగా సోషల్ మీడియా దిగ్గజం మెటా, సాఫ్ట్‌వేర్ సామ్రాట్ మైక్రోసాఫ్ట్ తీసుకున్న నిర్ణయాలు ఈ చేదు నిజాన్ని స్పష్టం చేస్తున్నాయి. మెటా ప్రకటించిన 8,000 మంది ఉద్యోగుల తొలగింపు, మైక్రోసాఫ్ట్ చేపట్టిన 8,750 మంది స్వచ్ఛంద పదవీ విరమణ పథకం కేవలం ఆర్థిక పొదుపు చర్యలు మాత్రమే కావు. ఇవి కంపెనీల ప్రాధాన్యతలలో వస్తున్న భారీ మార్పులకు సంకేతాలు. సిలికాన్ వ్యాలీలోని కంపెనీలు ఇప్పుడు 'మనుషుల తెలివితేటల' కంటే 'కృత్రిమ మేధ' అభివృద్ధికి, డేటా సెంటర్ల నిర్మాణానికి ఎక్కువ విలువ




ఇస్తున్నాయి. పాత పద్ధతుల్లో పనిచేసే ఉద్యోగుల కంటే, AI మోడల్స్ ను నడిపించే నిపుణులే ఇప్పుడు కంపెనీలకు ముఖ్యంగా భావిస్తున్నాయి. జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో బిలియన్ల కొద్దీ పెట్టుబడులు పెట్టాలంటే, కంపెనీలు తమ అంతర్గత నిర్వహణ ఖర్చులను తగ్గించుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఆటోమేషన్ వల్ల పది మంది చేసే పని ఒక్కరే చేసే వీలుండటంతో మధ్యస్థ స్థాయి ఉద్యోగాలపై వేటు పడుతోంది. సాంకేతిక విప్లవాలు వచ్చినప్పుడు పాత వృత్తులు కనుమరుగవడం చరిత్రలో కొత్తేమీ కాదు. అయితే ఇప్పుడు మార్పు వస్తున్న వేగం అత్యంత ఆందోళనకరం. కంపెనీలు లాభాల బాటలో పయనిస్తూ, AI రంగంలో ఆధిపత్యం కోసం చేస్తున్న ఈ యుద్ధంలో సామాన్య ఉద్యోగి బలిపశువు అవుతున్నాడు. మెటాలో మే 20 నుంచి మొదలయ్యే కోతలు, మైక్రోసాఫ్ట్ చరిత్రలోనే అతిపెద్ద లేఆఫ్ ప్రోగ్రామ్‌గా మారనుంది. ఇవన్నీ టెక్ నిపుణులకు ఒక హెచ్చరిక. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోకపోతే, ఎంతటి అనుభవం ఉన్నా రేపటి రేసులో వెనుకబడిపోక తప్పదని ఈ పరిణామాలు హెచ్చరిస్తున్నాయి. సాంకేతికత మనిషికి సాయపడాలి కానీ, మనిషి ఉనికికే సవాలుగా మారకూడదు. లాభాల వేటలో మానవ వనరుల విలువను విస్మరించడం భవిష్యత్తులో సామాజిక సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉంది. టెక్ దిగ్గజాలు AI అభివృద్ధిపై చూపే శ్రద్ధలో కొంత భాగమైనా తమ ఉద్యోగుల భవిష్యత్తును కాపాడటంపై చూపాల్సిన అవసరం ఉందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## నేటి ఐపీఎల్ మ్యాచ్‌లు

ఢిల్లీ క్యాపిటల్స్ vs పంజాబ్ కింగ్స్
ఢిల్లీ 3:30pm

రాజస్థాన్ రాయల్స్ vs సన్ రైజర్స్ హైదరాబాద్
జైపూర్ 7:30pm



| | Team | M | W | L | NRR | Pts |
|---|---|---|---|---|---|---|
| 1 | PBKS | 6 | 5 | 0 | +1.420 | 11 |
| 2 | RCB | 7 | 5 | 2 | +1.101 | 10 |
| 3 | RR | 7 | 5 | 2 | +0.790 | 10 |
| 4 | SRH | 7 | 4 | 3 | +0.820 | 8 |
| 5 | CSK | 7 | 3 | 4 | +0.118 | 6 |
| 6 | DC | 6 | 3 | 3 | -0.130 | 6 |
| 7 | GT | 7 | 3 | 4 | -0.790 | 6 |
| 8 | MI | 7 | 2 | 5 | -0.736 | 4 |
| 9 | LSG | 7 | 2 | 5 | -1.277 | 4 |
| 10 | KKR | 7 | 1 | 5 | -0.879 | 3 |

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**రూ.4 లక్షల కోట్లు ఆవిరి !**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



అంతర్జాతీయ రాజకీయ సంక్షోభం భారత స్టాక్ మార్కెట్లను కుదిపేసింది. పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు, ముఖ్యంగా హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు ఆటంకాలు కలగడం ఇన్వెస్టర్లలో వణుకు పుట్టించింది. అమెరికా, ఇరాన్ చర్చల వైఫల్యం ఆజ్యం పోయడంతో శుక్రవారం దలాల్ స్ట్రీట్ భారీ నష్టాలను మూటగట్టుకుంది. స్టాక్ మార్కెట్ కుప్పకూలడంతో ఇన్వెస్టర్ల సంపద రూ.4 లక్షల కోట్లు ఆవిరయ్యింది. సెన్సెక్స్ 982.71 పాయింట్లు పతనమై 76,681.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 275.10 పాయింట్లు నష్టపోయి కీలకమైన 24,000 మార్కును కోల్పోయింది. ప్రస్తుతం 23,897.95 వద్ద స్థిరపడింది. ఈ పతనంలో అత్యంత దారుణంగా దెబ్బతిన్నది ఐటీ రంగమే. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5 శాతం మేర పడిపోయింది. ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి దిగ్గజ కంపెనీల షేర్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఐటీతో పాటు ఫార్మా, మీడియా రంగ సూచీలు కూడా నష్టాల బాట పట్టాయి. మెటల్ రంగం మాత్రం కొంత మేర స్థిరత్వాన్ని ప్రదర్శించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 107.25 డాలర్లకు చేరడం భారత ఆర్థిక వ్యవస్థపై ఆందోళన పెంచింది. చమురు ధరలు 100 డాలర్ల మార్కును దాటడం వల్ల దేశ కరెంట్ ఖాతా లోటు పెరుగుతుందని, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తుందని మార్కెట్ వర్గాలు భయపడుతున్నాయి. గ్లోబల్ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగినంత కాలం భారత మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. క్రూడ్ ఆయిల్ ధరల కదలికలే రాబోయే రోజుల్లో మార్కెట్ దిశానిర్దేశాన్ని నిర్ణయించనున్నాయి. బజాజ్ ఫైనాన్స్, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్సీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు కాస్త కోలుకోగా... టీసీఎస్, టెక్ మహీంద్రా, సన్ ఫార్మా స్టాక్స్ నష్టపోయాయి. బంగారం ఔన్సు 4681 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జేపీ మోర్గాన్ భారత స్టాక్ మార్కెట్ రేటింగును ఓవర్ వెయిట్ నుండి న్యూట్రల్ కు తగ్గించింది.

## గ్యాస్ సెగకు 'ఇండక్షన్' మందు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతల వేళ, దేశీయంగా ఇంధన భద్రతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్లాన్‌బి'ని సిద్ధం చేసింది. వంటగ్యాస్ సెగకు ఇండక్షన్ మందుతో చెక్ పెడుతోంది. LPG సరఫరాలో ఏర్పడే అస్థిరతను అధిగమించేందుకు, ప్రత్యామ్నాయంగా ఇండక్షన్ కుక్ టాప్ లను సామాన్యులకు చేరువ చేసేలా భారీ రాయితీలు ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఇండక్షన్ కుక్ టాప్ లపై ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని వాణిజ్య మంత్రిత్వ శాఖ సిఫార్సు చేసింది. వీటి తయారీకి అవసరమైన విడిభాగాల దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడం ద్వారా తయారీ వ్యయం తగ్గించాలని యోచిస్తోంది. ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే మార్కెట్లో ఇండక్షన్ స్టవ్ ల ధరలు గణనీయంగా తగ్గి, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను పెంచేందుకు తయారీదారులకు ప్రభుత్వం పలు మినహాయింపులు ఇచ్చింది. విద్యుత్ ఉపకరణాలపై తప్పనిసరి నాణ్యత నియంత్రణ ఉత్తర్వుల అమలును 2026 అక్టోబర్ వరకు పొడిగించింది. దీనివల్ల ఉత్పత్తి ప్రక్రియలో ఆటంకాలు తొలగి మార్కెట్ లోకి నిరంతరాయంగా ఉత్పత్తులు వచ్చే అవకాశం ఉంది. గత నెల రోజుల్లోనే 157 తుది లైసెన్సులు, 38 కొత్త సిఎన్‌జీ స్టేషన్లకు అనుమతులు ఇచ్చారు. ఎల్‌పిజి ప్లాంట్లలో రాత్రి వేళల్లో కూడా కార్యకలాపాలు సాగించేందుకు ప్రత్యేక అనుమతులు లభించాయి. బయోగ్యాస్ నిల్వ, క్రయోజెనిక్ సిలిండర్ల వినియోగానికి నిబంధనలను సరళీకరించారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ చమురు ధరలు భారత్ వంటి దిగుమతి దేశాలపై ప్రభావం చూపుతాయి. ఈసారి ప్రభుత్వం కేవలం సరఫరాను సరిచేయడమే కాకుండా, ప్రజలను విద్యుత్ ఆధారిత వంట వైపు మళ్లించడం ద్వారా దీర్ఘకాలిక పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది.

# మల్టీ స్పోర్ట్స్ డ్రామా!



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే 'పెద్ది'. దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో చేస్తున్న ఈ సినిమా ఒక మల్టీ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతుంది. ఇక ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. అలాగే ఒక్క పాట మినహా మిగతా సినిమా అంతా పూర్తయినట్టు మేకర్స్ తెలిపారు. ఈ సాంగ్ చిత్రీకరణ కూడా కొనసాగుతుండగా సినిమా విడుదల విషయంలో కూడా మేకర్స్ జూన్ అని ఖరారు చేశారు. కానీ జూన్ లో ఏ డేట్ అనేది ఇప్పుడు లేటెస్ట్ బజ్ వినిపిస్తుంది. ఇప్పటికి ఇంకా పూర్తి కావాల్సి ఉన్న పనుల రీత్యా పెద్ది జూన్ 4న వచ్చే సమస్య లేదట. సో దీనితో పెద్ది జూన్ 25 నుంచి థియేటర్స్ లో సందడి చేస్తుంది అని తెలుస్తుంది. అలానే 24 రాత్రి నుంచే ప్రీమియర్స్ కూడా పడే అవకాశం ఉందట. సో పెద్ది విడుదల అప్పటికే అనుకోవచ్చు. అలానే ఈ డేట్ పై మేకర్స్ అధికారిక క్లారిటీ కూడా త్వరలోనే ప్రకటించనున్నారట.



# ఏడేళ్లుగా అందని విజయం!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఒకప్పుడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా వెలిగిపోయిన పూజా హెగ్డే.. ప్రస్తుతం తన కెరీర్ లో అత్యంత క్లిష్ట దశను ఎదుర్కొంటోంది. వరుసగా ఆమె నటించిన 'దేవా', 'రెట్రో' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. దీంతో ఇప్పుడు ఆమె ఆశలన్నీ కోలీవుడ్ చిత్రం 'జననాయగన్', బాలీవుడ్ మూవీ 'హాయ్ జవానీ తో ఇష్క్ హోనా హై'పైనే ఉన్నాయి. వీటితో పాటు రాఘవ లారెన్స్ 'కాంచన 4', దుల్కర్ సల్మాన్ 'డీ క్యూ 41' చిత్రాల్లో కూడా ఆమె నటిస్తోంది. గత కొన్నేళ్లుగా పూజా హెగ్డేకు ఓ సరైన హిట్ కూడా దక్కలేదు. 2022లో ప్రభాస్ సరసన నటించిన 'రాధే శ్యామ్' నుంచి మొదలుకొని బీస్ట్, ఆచార్య, సర్కస్, 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్', దేవా, రెట్రో చిత్రాల వరకు ఆమె నటించిన దాదాపు ఏడుకు పైగా సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. పాన్ఇండియనా స్థాయిలో క్రేజ్ ఉన్నప్పటికీ.. వరుస డిజాస్టర్లు ఆమె మార్కెట్‌ను దెబ్బతీస్తున్నాయి. ఈ క్రమంలో ఓ భారీ విజయం సాధించి మళ్లీ ఫామ్‌లోకి రావాలని పూజా హెగ్డే గట్టిగా ప్రయత్నిస్తోంది. దళపతి విజయ్ సరసన పూజ్ హెగ్డే నటించిన 'జననాయగన్' చిత్రంపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ సినిమాతోనైనా పూజా హెగ్డే సక్సెస్ ట్రాక్ ఎక్కుతుందని భావించారు. అయితే సెన్సార్‌షిప్ సమస్యల కారణంగా ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడం.. అదే సమయంలో ఈ సినిమా ఆన్‌లైన్లో లీక్ కావడం పూజా హెగ్డే కెరీర్‌పై పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు. ఈ పరిణామాల వల్ల 'జననాయగన్' బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఇంపాక్ట్ చూపించలేకపోవచ్చని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక తాజాగా పూజా హెగ్డే నటిస్తున్న బాలీవుడ్ సినిమా 'హాయ్ జవానీ తో ఇష్క్ హోనా హై' గ్లింప్స్ విడుదలైంది. అయితే ఇందులో ఏఐ వాడకంపై సోషల్ మీడియాలో భారీగా ట్రోల్స్ వచ్చాయి.

# 'జెట్లీ' జర్నీ అలా మొదలైంది..

డైరెక్టర్ రితేష్ రానా ఇంటర్వ్యూ..



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ) హేమలత పెద్దామల్లు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా కథానాయికగా తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తున్నారు. వెన్నెల కిషోర్, అజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ట్రైలర్ అద్భుతమైన రెస్పాన్స్ తో మంచి బజ్ క్రియేట్ చేశాయి. 'జెట్లీ' మే 1న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా థియేటర్స్ లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ రితేష్ రానా మీడియాతో మాట్లాడుతూ సినిమా విశేషాలు పంచుకున్నారు.

**'జెట్లీ' జర్నీ ఎప్పుడు మొదలైంది?**
2020లో కోవిడ్ సమయంలో జయేంద్ర అనే రచయితతో కలిసి ఈ కథను డెవలప్ చేశాను. అప్పటి నుంచే ఈ సినిమా చేయాలని అనుకుంటున్నాం. ఫైనల్‌గా గత నవంబర్‌లో ప్రారంభించి, ఇప్పుడు రిలీజ్‌కు తీసుకువస్తున్నాం.

**'జెట్లీ'ని మొదట పెద్ద హీరోతో ఇంటెన్స్ థ్రిల్లర్‌గా చేయాలనుకున్నారట?**
పూర్తిగా థ్రిల్లర్ కాకుండా, కొంత హ్యూమర్ ఉన్న థ్రిల్లర్‌గా చేయాలని అనుకున్నాం. షూటింగ్ మొత్తం ఫ్లైట్‌లోనే జరుగుతుంది. అది ఒక ఎక్స్ పెరిమెంట్. కొందరితో మాట్లాడినప్పుడు ఈ టైంలో అలాంటి ఎక్స్ పెరిమెంట్ అవసరమా అనే అభిప్రాయాలు వచ్చాయి. తర్వాత సత్యతో ఈ సినిమా చేయాలని అనిపించింది. 'మత్తు వదలరా' తర్వాత నాకు ఆ బడ్జెట్, మార్కెట్ స్కోప్ వచ్చింది. సత్యకి తగ్గట్టు క్యారెక్టర్ మార్చి తెరకెక్కించాం.

**సత్యకి కథ చెప్పినప్పుడు ఆయన రియాక్షన్?**
మొదట ఈ కథ చెప్పినప్పుడు ఆయన పాత్ర ఫ్లైట్ అటెండర్. తర్వాత 'నువ్వే హీరో' అని చెప్పినప్పుడు షాక్ అయ్యారు. మొదట రిస్క్ అన్నారు. కానీ నేను దీన్ని ఎలా తీస్తానో వివరంగా చెప్పిన తర్వాత చాలా ఎక్సైట్ అయ్యారు. ఆయన క్యారెక్టర్‌లో సీరియస్‌నెస్, హ్యూమర్, సస్పెన్స్.. అన్నీ ఉంటాయి.

**'జెట్లీ' టైటిల్ జస్టిఫికేషన్?**
'జెట్లీ' అనే నటుడు ఉన్నారు. అలాగే కథ జెట్‌లో జరుగుతుంది కాబట్టి ఇంట్రస్టింగ్ గా ఉంటుందని 'జెట్‌లీ' అనే టైటిల్ పెట్టాం.

**హీరో సత్యా? వెన్నెల కిషోరా?**
అది మీరు సినిమా చూసిన తర్వాతే తెలుస్తుంది (నవ్వుతూ).

**షూటింగ్ జర్నీ గురించి?**
ఈ సినిమా దాదాపు 80% ఫ్లైట్‌లోనే జరుగుతుంది. ఫ్లైట్ సెట్ వేసాం. ఎకానమీ, బిజినెస్ క్లాస్, కార్గో, కాక్పిట్ ఇలా ఒకే ఫ్లోర్‌పై ఐదు సెట్లు వేశాం. నేను తీసిన సినిమాల్లో ఇది చాలా టఫ్ మూవీ. దుబాయ్ నుంచి కొచ్చికి ల్యాండ్ అయ్యే జర్నీలో జరిగే కథ ఇది. యాక్షన్, థ్రిల్, హ్యూమర్..అన్నీ కలిపి మంచి ఎంటర్‌టైనర్.

**వెన్నెల కిషోర్ పాత్ర గురించి?**
ఈ సినిమా అంతా ఆయన సుడోకు ఆడుతుంటారు. పరిస్థితులకు తగ్గట్టు సినిమా టైటిల్స్ రాస్తుంటారు. చాలా టిపికల్ క్యారెక్టర్.

**రియా సింఘా పాత్ర గురించి?**
ఇది ఆమె తొలి తెలుగు సినిమా. చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్. స్పెషల్ ఏజెంట్ పాత్రలో కనిపిస్తుంది. చాలా చక్కగా పెర్ఫార్మ్ చేశారు.

**అజయ్ పాత్ర గురించి?**
అజయ్ ప్రజాపతి అనే పాత్రలో కనిపిస్తారు. ఒక బ్యాంక్ స్కామ్ చేసి పారిపోతుంటారు. ఆయన్ని వెనక్కి తీసుకురావడమే కథలో కీలకం.

**సత్యతో మీ సింక్ గురించి?**
మా ఇద్దరికీ నాన్ సింక్ ఉంటుంది. ఆ నాన్ సింక్ నుంచే మంచి సింక్ వస్తుంది (నవ్వుతూ). మేమిద్దరం డిఫరెంట్. అదే వర్క్ అవుట్ అవుతుంది.

**ప్రొడ్యూసర్ చెర్రీ గారి గురించి?**
ఆయనతో మాత్రం నాకు పర్ఫెక్ట్ సింక్ ఉంటుంది. నా ఎక్స్ పెరిమెంట్స్ కి ఎప్పుడూ సపోర్ట్ చేస్తారు. నేను ఒక హీరోతో ప్లాన్ చేసి సడన్‌గా సత్యతో చేస్తానన్నా కూడా నాపై పూర్తి నమ్మకం ఉంచారు.

**కాలభైరవ మ్యూజిక్ గురించి?**
నా టెక్నికల్ టీమ్ అంతా నా మొదటి సినిమా నుంచి నాతోనే ఉంది. ఇందులో ఒక సాంగ్ ఉంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా చాలా ఇంపాక్ట్ ఫుల్‌గా ఉంటుంది. బిట్ సాంగ్స్ కూడా ఉన్నాయి. సినిమా నిడివి దాదాపు 2 గంటలు 10 నిమిషాలు.

**మీ కామెడీ స్టైల్‌పై ఎవరి ప్రభావం?**
చాలామంది ప్రభావం ఉంటుంది. క్రేజీ మోహన్ గారి కామెడీ స్టైల్ నాకు చాలా ఇష్టం. అలాగే సెటైర్, సర్కాసం కూడా ఇష్టం. హాలీవుడ్ కామెడీని కూడా ఇష్టపడతాను.

**ఈ సినిమాలో చిరంజీవి గారి రిఫరెన్స్ ఉందా?**
సినిమా చిరంజీవి గారి ఫ్రేమ్‌తోనే ప్రారంభమవుతుంది. నా గత సినిమాల్లో కూడా ఆయన రిఫరెన్స్ ఉంటుంది. ఇదీ అలాగే కొనసాగింది.

**మీ ప్రమోషన్స్ చాలా యూనిక్ గా వుంటాయి కదా?**
ఈ రోజుల్లో ప్రమోషన్స్ చాలా ముఖ్యం షూటింగ్ సమయంలోనే ప్లాన్ చేస్తాను. ఈ సినిమాకి కూడా అలానే ప్లాన్ చేశాను.

-ఎం.డి అబ్దుల్

# హాట్ టాపిక్‌గా..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సినీ పరిశ్రమలో ఒక క్రేజీ ప్రాజెక్ట్ దక్కిందంటే అది కెరీర్‌కు ప్లస్ అవుతుందని అందరూ భావిస్తారు. కానీ కొన్నిసార్లు ఆ భారీ చిత్రాల షూటింగ్ ఆలస్యం కావడం వల్ల నటీనటులు ఇతర అవకాశాలను వదులుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్, యంగ్ హీరోయిన్ కాయదు లోహర్ విషయంలో ఇదే జరుగుతోంది. తాము కమిట్ అయిన భారీ పాన్ ఇండియా చిత్రాల కోసం వీరు దాదాపు 3 నుంచి 4 క్రేజీ సినిమాలను వదులుకోవాల్సి వచ్చిందన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్స్ ..మేకర్స్ కోరిన బల్క్ డేట్స్ కారణంగా ఆమె వేరే చిత్రాలకు సైన్ చేయలేకపోతోందట. ఇప్పటికే ఆమె చేతికి వచ్చిన కొన్ని మంచి ఆఫర్లను వదులుకున్నట్లు సమాచారం. అయితే ప్రశాంత్ నీల్ సినిమాలో ఛాన్స్ అంటే అది మామూలు విషయం కాదు కాబట్టి, ఈ నిరీక్షణకు తగ్గ ఫలితం ఉంటుందని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు. మరోవైపు నాని - శ్రీకాంత్ ఓదెల కాంబోలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంలో కాయదు లోహర్ 'సుబ్బలక్ష్మి'గా నటిస్తోంది. ఈ సినిమా కోసం ఆమె కూడా కొన్ని ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చిందని టాక్. 'దసరా' వంటి మాసివ్ హిట్ తర్వాత శ్రీకాంత్ ఓదెల తీస్తున్న సినిమా కావడంతో కాయదు లోహర్ ఈ చిత్రం కోసం ఎక్కువ డేట్స్ కేటాయిస్తోంది. ఈ సినిమాలు విడుదలైన తర్వాత ఈ ఇద్దరు భామలకు ఆశించిన స్థాయిలో గుర్తింపు రావాలని వారు చేసిన త్యాగానికి తగిన ప్రతిఫలం దక్కాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.



రుక్మిణి వసంత్

# మళ్ళీ వెనక్కి..?

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అక్కినేని అభిమానులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కొత్త చిత్రాల్లో అఖిల్ అక్కినేని హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న గ్రామీణ నేపథ్య మాస్ చిత్రం 'లెనిన్' కూడా ఒకటి. ఎపుడో షూట్ మొదలు పెట్టుకున్న ఈ సినిమా పలు వాయిదాలు పడుతూ వస్తుంది. రీసెంట్ గానే మే 1 నుంచి జూన్ కి వాయిదా అని కన్ఫర్మ్ చేశారు. కానీ ఇప్పుడు జూన్ నుంచి కూడా సినిమా మళ్ళీ వెనక్కి వెళుతున్నట్టు గట్టి బజ్ వినిపిస్తుంది. ఇక కొత్త డేట్, రిలీజ్ ప్లాన్స్ ఏంటి అనేవి చూస్తే ఈసారి సినిమా జూన్ నుంచి జూలై లేదా ఆగస్ట్ విడుదలకి చూస్తున్నట్టు తెలుస్తుంది. ఓ ఇంకో నెల లేదా నెలన్నర గ్యాప్ సినిమా తీసుకోనుంది అని చెప్పాలి. ఇక దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా బయటకి రావాల్సి ఉంది. ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



# కెరీర్‌కు మరో ప్లస్..



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

వరుస పరాజయాలతో సతమతమవుతున్న యంగ్ హీరో నితిన్, ఈసారి ఎలాగైనా హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. కెరీర్ పరంగా కీలకమైన దశలో ఉన్న ఆయన, కథల ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ఇటీవల కొన్ని ప్రాజెక్టులు చర్చల దశలోనే ఆగిపోగా, మరికొన్ని చేజారిపోయాయి. ఈ క్రమంలోనే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ఒక కొత్త దర్శకుడికి నితిన్ అవకాశం ఇచ్చాడు. ఈ నెలాఖరున ఈ చిత్రం అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ సినిమాలో నితిన్ సరసన హీరోయిన్‌గా రితికా నాయక్ నటించబోతున్నట్లు సమాచారం. 'అశోకవనంలో అర్జున కల్యాణం' చిత్రంతో తన నటనతో మెప్పించిన రితికా, ప్రస్తుతం వరుస ఆఫర్లతో దూసుకుపోతోంది. ఇప్పుడు నితిన్ సినిమాలో అవకాశం దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు మరో ప్లస్ కానుంది. ఇక ఈ సినిమా విషయానికి వస్తే, ఇది ఒక పక్కా ఫ్యామిలీ డ్రామా సబ్జెక్ట్ గా రానుందని తెలుస్తోంది. నితిన్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయేలా, ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆకట్టుకునేలా ఈ కథను సిద్ధం చేశారట. ఇప్పటికే చిత్ర యూనిట్ ఒక ఆసక్తికరమైన టైటిల్‌ను కూడా ఖరారు చేసినట్లు సమాచారం. మరి నితిన్‌రితికా కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుంటుందో చూడాలి.

# చిన్న సినిమాలను తొక్కేస్తున్నారు..



**ఆ నలుగురు రాక్షసుల చేతుల్లోనే థియేటర్లు..**

**ప్లీజ్ సేవ్ తెలుగు ఫిలిం ఇండస్ట్రీ**

**కన్నీళ్లు పెట్టుకున్న నటుడు, దర్శకుడు షెరాజ్ మెహదీ**

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

తెలుగు సినిమా పరిశ్రమలో చిన్న సినిమాలకు థియేటర్లు దక్కడం లేదని నటుడుదర్శకుడు షెరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు ఫిలిం చాంబర్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ, తన దర్శకత్వంలో తానే హీరోగా నటించిన 'ఓ అందాల రాక్షసి' సినిమా రీ-రిలీజ్‌కు కూడా థియేటర్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు . ప్రేక్షకుల అభ్యర్థన మేరకు ఏప్రిల్ 24న ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేయాలని నిర్ణయించినప్పటికీ, ముఖ్యంగా నైజాం ప్రాంతంలో ఒక్క థియేటర్ కూడా ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. "మా సినిమాకు ఈసారి కూడా థియేటర్లు ఇవ్వడం లేదు. ఇది చిన్న సినిమాలపై జరుగుతున్న అన్యాయం" అని ఆయన అన్నారు. తెలుగు సినిమా థియేటర్ వ్యవస్థ కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని షెరాజ్ మెహదీ ఆరోపించారు. "ఆ నలుగురు రాక్షసుల చేతుల్లో సినిమా థియేటర్లు ఉన్నాయి. చిన్న సినిమాలు విడుదల కాకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై నేను లీగల్‌గా పోరాటం చేస్తాను" అని స్పష్టం చేశారు. చిన్న సినిమాల నిర్మాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని, ఇలాంటి పరిస్థితులు కొనసాగితే చిన్న సినిమా నిర్మాణం పూర్తిగా ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. తనకు వ్యక్తిగతంగా తీవ్ర మానసిక ఒత్తిడి ఎదురవుతోందని చెప్పిన షెరాజ్ మెహదీ, "నాకు ఏమైనా జరిగితే దిల్ రాజు, సురేష్ బాబు, బిజిలి, సునీల్ వంటి వారే కారణం అవుతారు" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఇక ఐనాక్స్, ఏషియన్ థియేటర్ వ్యవస్థలో కూడా ముందుగా హామీ ఇచ్చినా థియేటర్లు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. తెలుగు పరిశ్రమలో చిన్న సినిమాలను అణగదొక్కు తున్నారని షెరాజ్ మెహదీ ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్న సినిమాల మూవీ మేకర్లు చనిపోతున్నారు. మంచి సినిమాలను కూడా చంపేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని దారుణ పరిస్థితి ఇక్కడ ఉంది. బాలీవుడ్‌లో కూడా ఇలా ఉండదు" అని అన్నారు. చిన్న సినిమాలకు సమాన అవకాశాలు కల్పించకపోతే పరిశ్రమలో కొత్త ప్రతిభ ఎదగడం కష్టమవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీని కాపాడాలని కోరుతూ "ప్లీజ్ సేవ్ తెలుగు ఫిలిం ఇండస్ట్రీ" అని షెరాజ్ మెహదీ విజ్ఞప్తి చేశారు.

Printed and Published By SHAIK MASTAN on behalf of AARAA DIGITAL NEWS NETWORKS, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: SHAIK MASTAN, Phone No. 040 - 24099999, PRGI REG. No. : TGTEL/25/A0540